ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 27.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
3
బుధవారం 16 జూలై 2025

తల్లికి వందనం ఏలూరుకు అధిక లబ్ధి

ఏలూరు అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులు 2,44,113 మందికి తల్లికి వందనం పథకంలో అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖకు ఉన్నతాధికారులు సమాచారం ఇచ్చారు. ఒక్కో విద్యార్థికి రూ.13వేలు చొప్పున విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ నెల 10న నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం రోజు నుంచి రెండో విడత తల్లికి వందనం ఆర్థికసాయాన్ని పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా తల్లికి వందనం లబ్ధిపొందిన మండలాల్లో ఏలూరు అర్బన్, రూరల్ మండలం 45,311 మంది అర్హులతో ప్రథమ స్థానంలో ఉంది. తదుపరి స్థానాల్లో జంగారెడ్డిగూడెం 20,899 మంది, నూజివీడు 20,410, చింతలపూడి 13,557, కొయ్యలగూడెం 9889, కైకలూరు 9809, భీమడోలు 9604, పెదవేగి 9321, బుట్టాయగూడెం 8216, తదితర మండలాలుండగా, అత్యల్పంగా 2213 మంది వేలేరుపాడు మండలంలో లబ్ధిపొందారు.

ఆర్టీసీ ఏసీ బస్సులలో ఆషాఢం ఆఫర్

రాకపోకలకు 10 శాతం రాయితీ

డీపీటీవో షేక్ షబ్నం

ఏలూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులకు తగ్గడంతో ఆషాఢం ఆఫర్ ప్రకటించింది. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు నుంచి బయల్దేరే అన్ని ఏసీ బస్సులకు 10 శాతం చార్జీ రాయితీని ఇస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి షేక్ షబ్నం మంగళవారం తెలిపారు. వచ్చినప్పుడు, వెళ్లినపుడు కూడా 10 శాతం ఛార్జీ రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ నెల 24 వరకు రాయితీ ఉంటుందని, ప్రయాణికులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని షబ్నం కోరారు.

జాతీయ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల గడువు పొడిగింపు

ఏలూరు అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 17వరకు గడువు ఇచ్చారు. పూర్తి ప్రతిపాదనలను ఆన్‌లైన్‌లో సమర్పించేందుకు తుది గడువు ఈ నెల 20వరకు పొడిగించినట్టు డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. అర్హతలుగల టీచర్లు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.



బుట్టాయగూడెంలో తనిఖీ చేస్తున్న సీఐ మధుబాబు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్

జీలుగుమిల్లి/బుట్టాయగూడెం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణంపై కేంద్ర వ్యవసాయ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. జీలుగుమిల్లి సాధు ట్రేడర్స్ దుకాణంలో ఎరువులు, విత్తనాలు నిల్వలు గుర్తించారు. బుట్టాయగూడెం మండలంలో కూడా తనిఖీలు నిర్వహించారు. ఏడీఏ వి.వెంకటేశ్వరరావు, విజిలెన్స్ సీఐ మధుబాబు, ఏవో కె.గంగాధరం, వీహెచ్ఏలు ప్రసాద్, రాజు ఉన్నారు.

దిద్దుబాట్లు.. లేదంటే పాట్లే!
కౌన్సెలింగ్ సిబ్బంది తప్పిదాలు..
ఏఎన్ఎంలకు అగచాట్లు.. 5

2 రోజుల్లో ఎంపీహెచ్ఏ (మేల్) ఉద్యోగులకు పని సర్దుబాటు

డ్రోన్ పట్టేస్తుంది !
యాప్ ప్రవేశపెట్టిన ఎస్పీ కిశోర్ 4



అధికారులు, పారిశ్రామికవేత్తలతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, వేదికపై ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కిశోర్, జేసీ ధాత్రిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యేలు బడేటి చంటి, సొంగా రోషన్‌కుమార్, చింతమనేని ప్రభాకర్

ప్రతి నియోజకవర్గంలో 50 ఎకరాల్లో

పారిశ్రామిక వాడ

జిల్లా విజన్ సమీక్షలో ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

- భూమి సేకరించండి
- యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి
- పరిశ్రమల స్థాపనకు చర్యలు
- వనరులు సద్వినియోగం చేసుకోవాలి
- అధికారులకు మంత్రి దిశానిర్దేశం

ఏలూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి అవకాశాలు పెంచడానికి ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఏర్పాటుకు అనువుగా ప్రతీ నియోజకవర్గంలో 50 నుంచి 100 ఎకరాల భూమిని గుర్తించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్‌లో జిల్లా, నియోజకవర్గాల విజన్ యాక్షన్‌ప్లాన్‌పై మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో అధికారులతో మంత్రి నాదెండ్ల సమీక్షించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా, నియోజకవర్గాలకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏటా 15 శాతం వృద్ధిరేటు లక్ష్యం సాధించేలా చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే సమావేశం నాటికి విజన్ యాక్షన్ ప్లాన్ తుది ప్రణాళికను స్వల్ప, దీర్ఘకాలిక లక్ష్యాలతో సిద్ధం చేయాలని మంత్రి సూచించారు.

నూతన పారిశ్రామిక విధానం ద్వారా జిల్లాలో పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకోవాలన్నారు. రాజధాని అమరావతి, ప్రధాన నగరం విజయవాడ ఏలూరుకు చేరువలో ఉండడం, జాతీయ రహదారి, రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉండడంతో జిల్లాలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారన్నారు. జిల్లాలో వ్యవసాయంతో పాటు ఆక్వా, ఉద్యానరంగాల్లో అందుబాటులో ఉన్న వనరులను

మిగతా 6వ పేజీలో



పామాయిల్ ప్లాంటేషన్‌లో మంత్రి నాదెండ్ల

మెగా పామాయిల్ ప్లాంటేషన్

దెందులూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): పామాయిల్ పంటలను ప్రోత్సహించేందుకు మెగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టినట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సీతంపేట పసుమర్తి మధుబాబు వ్యవసాయ క్షేత్రంలో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి మంగళవారం పామాయిల్ మొక్కలను నాటారు. కూటమి ప్రభుత్వం పామాయిల్ రైతులకు అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. జిల్లాలో 19 లక్షల పామాయిల్ మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పామాయిల్ గెలలు కోయడానికి ప్లాస్టిక్ పనిముట్లు అందించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కోరడంతో మంత్రి స్పందించి జిల్లాలోనే ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ చేయిస్తామన్నారు. సొసైటీ అధ్యక్షుడు యలమర్తి శ్రీను, రెడ్డి అప్పలనాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు చినబాబు, ఘంటశాల వెంకటలక్ష్మి, ఉద్యానవన శాఖ డీడీ ఎస్.రామ్మోహనరావు, రైతులు పాల్గొన్నారు



హామీలన్నీ నెరవేరుస్తాం
వైసీపీ ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్లు అప్పు చేసి వెళ్లింది
రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్న సీఎం చంద్రబాబు
పురపాలక శాఖ మంత్రి నారాయణ 5

• సాగు నీరు లేదు..!



సాగు నీరందించాలని వెంకటాపురంలో ధర్నా చేస్తున్న రైతులు

ఏలూరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సాగు నీరందక వరి నారుమడులు ఎండిపోతున్నాయని, నాట్లు వేసిన చేలు బీటలు వారాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగు నీరందించి పంటలు కాపాడాలంటూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, కౌలు రైతులు మంగళవారం ధర్నా చేపట్టారు. వెంకటాపురం రైతు సేవా కేంద్రం వద్ద ఎండిపోతున్న నారుమడిలో బీటలు వారిన మట్టిగడ్డలతో నిరసన వ్యక్తం చేశారు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం మాదేపల్లి, జాలిపూడి, చాటపర్రు, పోణంగి, కొమరవోలు, కాట్లంపూడి తదితర గ్రామాలలో వేలాది ఎకరాలకు సాగునీరు అందడం లేదన్నారు. మెయిన్ కెనాల్ నుంచి జాలిపూడి మాదేపల్లి వైపు ప్రధాన పంటకాలువ గుర్రపుడెక్క, తూడు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిందన్నారు. అధికారులు స్పందించకుంటే బుధవారం ఏలూరు కైకలూరు రోడ్డును సుంకర వారి తోట వంతెన వద్ద దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు.

• సదరం తరలిపోయింది..!



కైకలూరు సదరం శిబిరంలో దివ్యాంగులు (ఫైల్)

కైకలూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల వైకల్యం పరిశీలించేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన సదరం శిబిరాన్ని కైకలూరు నుంచి ఏలూరు తరలించేశారు. సదరం క్యాంప్ కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించాల్సి ఉండగా అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఏలూరు తరలించడంపై దివ్యాంగుల కుటుంబాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రతీ బుధవారం ప్రత్యేక వైద్య నిపుణుల పర్యవేక్షణలో సదరం శిబిరం నిర్వహించేవారు. కదలలేని పరిస్థితిలో ఉన్నవారిని కారు, ఆటోలో ఏలూరు తీసుకెళ్లడానికి రూ.8వేల నుంచి రూ.10 వేలు ఖర్చు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముదినేపల్లి, కలిదిండి మండలాల శివారు గ్రామాల వారు 60 కిలోమీటర్లు ప్రయాణించాలి. కైకలూరు మండలంలో 581, కలిదిండి మండలం 344, ముదినేపల్లి మండలం 322, మండవల్లి మండలంలో 281 మంది దివ్యాంగులున్నారు. వైకల్య ధ్రువీకరణ పత్రాలు అందిస్తేనే పెన్షన్, రాయితీలు వర్తిస్తాయి.

• నో వాకింగ్..!



చెరువు గట్టుపై వాకింగ్ ట్రాక్ గేటుకు తాళం

చింతలపూడి, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల సౌకర్యార్థం చెరువుగట్టుపై మునిసిపల్ అధికారులు వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లినవారు వెనుదిరగాల్సిందే. వాకింగ్ ట్రాక్‌కు అధికారులు తాళాలు వేసేశారు. అమృత్ 2.0 పథకంలో మునిసిపాలిటీ సుందరీకరణ పేరుతో వేగిలింగేశ్వరస్వామి చెరువుగట్టు చదునుచేసి గేటు ఏర్పాటు చేశారు. దాతలు బెంచీలు, లైట్లు సమకూర్చారు. 'ఐ లవ్ చింతలపూడి' అంటూ లైటింగ్ బోర్డు ఏర్పాటు చేశారు. కానీ వాకింగ్ ట్రాక్ మాత్రం పట్టణ ప్రజలకు అందుబాటులో లేదు. రూ.78 లక్షలతో సుందరీకరణ చేపట్టిన చెరువు గట్టుకు ప్రజలు వెళ్లకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. తాళాలు ఎందుకు వేశారని అధికారులను అడిగితే పశువులు మొక్కలు తినేస్తున్నాయని, తేళ్లు, పాములు వాకింగ్ ట్రాక్‌పైకి వస్తున్నాయని చెబుతున్నారు. వాకింగ్ ట్రాక్.. సుందరీకరణ.. ఐ లవ్ చింతలపూడి ఎందుకని పట్టణ ప్రజలు నోరెళ్లబెడుతున్నారు.

నిర్లక్ష్యం..!

కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో జిల్లా పరిశ్రమల కేంద్ర భవనాలు శిథిలమయ్యాయి. కోట్లాది రూపాయల విలువైన ఎకరంన్నర స్థలం నిరుపయోగంగా ఉంది. 2018 జూలైలో కార్యాలయాన్ని అద్దె భవనాల్లోకి తరలించారు. ఇటీవల ఎన్ఆర్ పేటలో ఒక అద్దె భవనంలో పరిశ్రమల కేంద్రం చేరింది. పరిశ్రమలు, ఉపాధి యూనిట్ల పేరిట కోట్లాది రూపాయలు మంజూరు చేయించే శాఖకు కార్యాలయం లేకపోవడం విడ్డూరం.



- పరిశ్రమల కేంద్రం భవనం శిథిలం
- అద్దె భవనంలోకి తరలింపు
- కోట్లాది రూపాయల విలువైన స్థలం నిరుపయోగం
- చిట్టడవిని తలపిస్తున్న పిచ్చిమొక్కలు
- పట్టించుకోని అధికారులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పరిశ్రమలు స్థాపించే వారికి పరిశ్రమల కేంద్ర కార్యాలయంలో అవగాహన శిబిరాలు, ఇతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేవారు. కార్యాలయ భవనం శ్లాబ్‌లు పెచ్చులూడి పడిపోయింది. గోడలు పగిలిపోవడంతో సుమారు ఐదేళ్ల నుంచి అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. సుమారు ఎకరంన్నర స్థలం నిరుపయోగంగా పడిఉంది. విలువైన టేకు మొక్కలకు రక్షణ కరువైంది. పిచ్చిమొక్కలతో చిట్టడవిని తలపిస్తోంది. పాములు, ఇతర విష కీటకాలు చేరడంతో పక్కనే ఆర్టీసీ ఆసుపత్రి, ఉపాధి అధికారి కార్యాలయాల్లో సిబ్బంది కూడా భయపడుతున్నారు.

కొత్త భవనం నిర్మిస్తారా..?

విలువైన స్థలంలో పరిశ్రమల కేంద్ర కార్యాలయ భవనం నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేయాల్సి ఉంది. పరిశ్రమల్లో వివిధ విభాగాలను తనిఖీ చేసే ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ కార్యాలయం కూడా అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. జిల్లాకు సంబంధించి పరిశ్రమల మౌలిక సదుపాయాలు, ఖాదీ విలేజ్‌బోర్డు గ్రామీణ పరిశ్రమలకు కార్యాలయాలు లేవు. వీటన్నంటిని ఒకే కాంపౌండ్‌లో ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. తాజాగా ఏపీఐఐసీ సహకారంతో పీపీపీ మోడ్‌లో భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు కూడా ఆరా తీసి పరిశ్రమల కేంద్ర పాత భవనాలకు మోక్షం కల్పించాలని పారిశ్రామికవేత్తలు, యువత కోరుతున్నారు.

మా గోడు పట్టించుకోండి..!

- వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసింది
- జీతాలు పెంచాలి
- సమస్యలు పరిష్కరించాలి
- మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల ఆవేదన



నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ఏలూరుటూటౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు దీర్ఘకాలంగా సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని, ఆరేళ్లుగా ఒక్కో కార్మికుడు లక్షలాది రూపాయలు నష్టపోయామని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడుస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని వాపోతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ 75 రోజులుగా నగర పాలక సంస్థ, మునిసిపల్ కార్యాలయాల వద్ద మధ్యాహ్న భోజన సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. అరకొర వేతనాలతో కుటుంబాన్ని పోషించుకోవడం చాలా కష్టతరమవుతుందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు.

అప్పట్లో 17 రోజులు సమ్మె

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాలనలో కల్లబొల్లి కబుర్లతో కాలం వెళ్లబుచ్చారే తప్ప ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు. వైసీపీ హయాంలో తమ సమస్యలు పరిష్కరించాలంటూ 17రోజుల పాటు కార్మికులు సమ్మె నిర్వహించారు. సమ్మెతో దిగివచ్చిన వైసీపీ ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి కమిటీలు వేసి పరిష్కరించకుండానే ప్రభుత్వం వెళ్లిపోయింది. కూటమి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిస్తుందని కార్మికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వేతనాలు పెంచాలి

జీవో నెంబర్ 36 ప్రకారం స్కిల్డ్ వర్కర్‌కు రూ.29,500, సెమి స్కిల్డ్ వర్కర్లకు రూ.26500, అన్‌స్కిల్డ్ వర్కర్లు రూ.21000 జీతాలు చెల్లించాలి. కానీ కేవలం నెలకు రూ.15వేలు మాత్రమే వేతనాలు ఇస్తున్నారు. పారిశుధ్య కార్మికులకు రూ.21వేలు ఇస్తున్నారు. వారికంటే రూ.6వేలు ఇంజనీరింగ్ కార్మికులకు తక్కువగా వేతనాలు చెల్లిస్తున్నారు.

మిగతా 6వ పేజీలో..

టీచర్ లేని పాఠశాల!



పాఠశాల వరండాలో కూర్చున్న విద్యార్థులు

ఆ పాఠశాలకు ఉపాధ్యాయుడు లేరు. 25 మంది విద్యార్థులు ఉన్నారు. రోజూ పిల్లలు వస్తారు.. కాసేపు ఆడుకుని వెళ్లిపోతారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు మాత్రం భోజనం వండి పెడుతున్నారు. కానీ పర్యవేక్షణ లేదు. కుక్కునూరు మండలం దామరచర్ల ప్రాథమికోన్నత పాఠశాల తీరు ఇది. పిల్లలకు పాఠాలు చెప్పేవారు లేరు సరే.. కనీసం పట్టించుకునే వారు లేకపోవడంతో ఎందుకు పంపించాలని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

- దామరచర్ల పాఠశాలను పట్టించుకోని అధికారులు
- ఇటీవల 50 మంది టీచర్ల బదిలీ
- మండలంలో 85 పోస్టులు ఖాళీ

కుక్కునూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): పిల్లలను బడిలో చేర్పాలంటూ అధికారులు, ఉపాధ్యాయులు ప్రచారం చేస్తున్నారు. కుక్కునూరు మండలంలో ఉన్న విద్యార్థులకు పాఠాలు చెప్పే మాస్టార్లు లేరు. ఇటీవల మండలం నుంచి 50మందికి పైగా ఉపాధ్యాయుల బదిలీపై వెళ్లిపోయారు. 85 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దామరచర్ల పాఠశాలలో 7వ తరగతి వరకు తరగతులు ఉన్నాయి. ప్రతీరోజు స్కూల్‌కు 25 మంది విద్యార్థులు వస్తున్నారు. ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం మాత్రం వండి పెడుతున్నారు. సమీపంలో గోదావరి ఉండడంతో వరద ముంచుకొచ్చిన సమయంలో పిల్లలు అడువైపు వెళతారని విద్యార్థుల తల్లిదండ్రులు హడలిపోతున్నారు. పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడిని పంపి తరగతులు నిర్వహించకుండా అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.



ఖాళీగా ఉపాధ్యాయుడి కుర్చీ

ప్రాబ్లమ్ జోన్



పాలకోడేరు జగనన్న కాలనీలో నిర్మించిన గృహాలు, సచివాలయ భవనం, హెల్త్ సెంటర్‌లకు దారి లేని పరిస్థితి

జగనన్న కాలనీకి దారేది ?

రహదారి, విద్యుత్ సౌకర్యం లేక పాలకోడేరు కాలనీవాసుల అవస్థలు

సచివాలయం, హెల్త్ సెంటర్ నిర్మించినా నిరుపయోగం

పాలకోడేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ముందు చూపు లేకుండా పనులు చేపడితే అన్నీ ఇబ్బందులే.. పాలకోడేరులో ఉన్న జగనన్న కాలనీయే ఇందుకు నిదర్శనం. గత ప్రభుత్వ హయాంలో దారీ తెన్నూ లేకుండా సుమారు నాలుగు ఎకరాల్లో జగనన్న కాలనీకి స్థల సేకరణ చేపట్టారు. దానిలో సుమారు రెండు ఎకరాలు ఇప్పటికీ కోర్టులోనే ఉండగా మరో రెండు ఎకరాల 20 సెంట్లలో ఆ గ్రామంలోని లబ్ధిదారులు గృహాలను కూడా నిర్మించుకున్నారు. అయితే ఆ జగనన్న కాలనీకి వెళ్ళేందుకు నేటికీ సరైన రహదారి లేదు.. గృహాలకు విద్యుత్ సౌకర్యం లేదు.. పాములు, విష కీటకాలు మధ్యనే బిక్కుబిక్కుమంటూ కాలనీవాసులు నివాసం ఉంటున్నారు. ఇదే ప్రాంతంలో లక్షల రూపాయలు వెచ్చించి సచివాలయ భవనం, హెల్త్ సెంటర్ కూడా నిర్మించి ప్రారంభించారు.ఆ భవనాలు ప్రారంభించి సుమారు ఏడాదిన్నర గడుస్తున్నా నేటికీ అతీగతీ లేకుండా ఉపయోగం లేకుండా ఉన్నాయి. ప్రజలు చీకటిలో ఉండలేక వేరే వేరే గృహాల నుంచి కర్రల సహాయంతో వైర్లను లాక్కువెళ్ళి కాలక్షేపం చేస్తున్నారు. ఈ వైర్ల వల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే గాని విద్యుత్ అధికారుల్లో చలనం వచ్చేలా కనిపించడం లేదని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థలాలు చూపించి గృహాలు నిర్మించుకోమని అధికారులు ఆదేశించడంతో తాము ఇళ్ళ నిర్మించుకున్నామని, అయితే సరైన రహదారి నిర్మించకపోవడం, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడం వల్ల అక్కడ ఉండలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు త్వరితగతిన ఆ ప్రాంత వాసులకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నారు.




ఎల్ఎన్ పురంలో ప్రధాన వీధుల్లో రోడ్లపైకి వచ్చిన మురుగు నీరు

రోడ్లపైనే మురుగు

ఎల్ఎన్ పురంలో అపారిశుధ్యం

కాళ్ళ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఆ.. గ్రామంలో ఎక్కడ చూసినా మురుగు నీరే కనిపిస్తుంది. ఆఖరికి సచివాలయానికి వెళ్లాలన్నా మురుగు నీరు దాటుకునే వెళ్లాలి. కాళ్ళ మండలం ఎల్ఎన్ పురం గ్రామంలోని అన్ని ప్రాంతాల్లోనూ పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఇళ్లల్లో మురుగునీరు నేరుగా ప్రధాన రహదారిపైకి వదిలేస్తున్నా పట్టించుకునే వారే లేరు. వీధుల్లో దుర్గంధం వస్తున్నా కనీసం బ్లీచింగ్ చల్లేవారు లేరని, రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామమంతా ఇదే పరిస్థితి ఉన్నా కనీసం అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ప్రధాన సెంటర్‌లో అయితే మురుగునీరు రహదారి మధ్య నుంచి నేరుగా పంట కాలువలోకే వెళ్తున్నాయి. ఆ నీటినే మరలా మంచినీటి చెరువులోకి విద్యుత్ మోటార్లతో నింపుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలాంటి కలుషిత నీరు తాగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఈవోపీఆర్‌డీ ఎంవీ భాస్కరరావును వివరణ కోరగా గ్రామంలో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మురుగునీరు రోడ్లపైకి రాకుండా ఇళ్ల యజమానులకు నోటీసులు అందజేయాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేస్తామని, దీనిపై క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని స్పష్టం చేశారు.




వంతెనపై నడకదారిలో పెద్ద రంధ్రాలు .. రెయిలింగ్ ఊడిపోయిన దృశ్యం

డేంజర్‌లో బొబ్బిలి వంతెన !

గణపవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరు - పశ్చిమగోదావరి జిల్లాల వారధిగా ఉన్న బొబ్బిలి వంతెన శిథిలావస్థకు చేరింది. కూలేందుకు సిద్ధంగా ఉంది. గణపవరంలోని వెంకయ్య వయ్యేరుపై 1883లో బ్రిటీష్ ప్రభుత్వం నిర్మించిన ఈ వంతెనను బొబ్బిలిరాజు ప్రారంభించడంతో బొబ్బిలి వంతెనగా పిలుస్తుంటారు. గణపవరం పరిసర 120 గ్రామాల ప్రజలు ఈ వంతెన మీద నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. 1980లో బొబ్బిలి వంతెన కూలిపోయింది. భువనపల్లి గ్రామానికి చెందిన పట్టెం వెంకట్రావు అనే వ్యక్తి ఈ ఎడ్లబండిపై వెళుతూ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. 1982లో వంతెన తిరిగి నిర్మించారు. ఈ వంతెన నిర్మించి 43 ఏళ్లు దాటినా అనాటి నుంచి ఈనాటి వరకు కనీస మరమ్మతులు చేయలేదు. ఈ వంతెన మీదుగా ఉభయ, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి నిత్యం ఆక్వా, వ్యవసాయ ఉత్పత్తులు, తరలించే వాహనాలు, పాఠశాలల, ఆర్‌టీసీ బస్సులు తిరుగుతుంటాయి. ప్రస్తుతం ఈ రహదారిలోనే ఉన్న నారాయణపురం వంతెన కూడా శిథిలావస్థకు చేరి దెబ్బతినడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బొబ్బిలి వంతెనకు కూడా ఇదే పరిస్థితి వస్తుందని ఈ ప్రాంతవాసులు భయపడుతున్నారు. ఈ వంతెన మీద సపోర్టువాల్స్ ధ్వంసం అవడం, ఫుట్‌ఫాట్‌పై పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడటంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. పాదచారులు నడిచి రాత్రివేళల్లో కూడా కాల్వలో పడి కొట్టుకుపోయిన సంఘటనలు జరిగాయి. 2022 మే 16న గణపవరంలో జరిగిన సభలో అనాటి ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో బొబ్బిలి వంతెన మరమ్మతులకు 8.5 కోట్లు మంజూరైనా టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు.

• నిరంతరం ప్రమాదాలు



బొబ్బిలి వంతెన పూర్తిగా శిథిలమైంది. ఫుట్‌పాత్‌పై పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి. ఈ వంతెన పైనుంచి ఆట లాడుకునే పిల్లలతో సహా పలువురు పడి పోయారు. నాపరాళ్లు పెట్టి కాస్త ప్రమాదాలు అరికట్టాం. కనీసం అధికారులు కూడా మరమ్మతులు చేపట్టలేదు.

- అల్లూరి గంగరాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు, గణపవరం

• వంతెన నిర్మించాలి



బొబ్బిలి వంతెన తక్షణం పునర్నిర్మించాలి. సైడ్ వాల్స్ విరిగి పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు జిల్లా ప్రజలకు, వ్యాపా రులకు, రైతులకు ఈ వంతెనే ప్రధానం. గతఐదేళ్లలో పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కూటమి ప్రభుత్వం పునఃనిర్మించి ప్రమాదాల నుంచి కాపాడాలి.

- బైరబోయిన మాల్యాద్రి యాదవ్, వ్యాపారి, గణపవరం



డ్రోన్ పట్టేస్తుంది !



ఏలూరు శివారు ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని డ్రోన్ కెమెరాతో గుర్తించి అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు (ఫైల్)

ఏలూరు జిల్లా పోలీసు శాఖలో టెక్నాలజీ

అసాంఘిక శక్తులపై కొరడా

ప్రత్యేక డ్రోన్ కెమెరాలతో నిఘా

నేరస్తులను గుర్తించేందుకు ఫేస్ రికగ్నైజేషన్ ఏఐ కెమెరాలు

ప్రత్యేకంగా యాప్ రూపొందించిన ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఇంతకుముందు దొంగతనాలకు పాల్పడితే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి ఒక అంచనాకు వచ్చేవారు. ఆ కాలంలో ఒకరకమైన నేరాలు ఒక ముఠా మాత్రమే చేసేవారు. దీనివల్ల పోలీసులు విచారణ చేసి ఏ ముఠా పాల్పడిందో గుర్తించేవారు. నేడు లగ్జరీ లైఫ్‌కు అలవాటు పడిన యువత నేరాలకు పాల్పడుతున్నారు. ఎవరు ఏ నేరం చేస్తున్నారో తెలియని పరిస్థితి. ఏలూరు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ముందడుగు వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో నేరస్తుడిగా నమోదైన ఏ నేరస్తుడు అయినా జిల్లాలో ఏ ప్రాంతంలో తిరిగినా క్షణాల్లో అతని కదిలికలతో ఏలూరు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం వచ్చేస్తుంది. అంతేకాకుండా అతనిపై ఎన్ని కేసులు నమోద య్యాయి. ఏ నేరాల్లో వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయో తెలియజేస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫేస్ రికగ్నైజేషన్ కెమెరాలు క్షణాల్లో మెస్సేజ్‌లు పంపిస్తాయి. దీంతో 45 శాతం దొంగతనాలు నిలిచిపోయాయి. ఒక్కసారి ఈ జిల్లాలో పట్టుబడిన దొంగ మరోసారి ఇక్కడ చోరీ చేయాలంటే భయపడుతున్నారంటే ఈ కెమెరాల ప్రభావం ఎలా ఉందో తెలుస్తోంది.

ఫిర్యాదుల స్వీకరణలో ఏఐ

సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సమస్యలు విన్నవించేందుకు ఫిర్యాదుదారులు వస్తూ ఉంటారు. ఇక్కడ కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బూట్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి ఫిర్యాదుదారుడు తమ సమస్యను బూట్ ముందుకు వెళ్లి చెప్పాలి. దీనిలో వాస్తవాలు ఏమిటనేది తెలుసుకోవడానికి వెంటనే ప్రశ్నలు అడుగుతుంది. అందుకు సమాధానాలు చెప్పడం వల్ల పూర్తిస్థాయి వాయిస్, వీడియో రికార్డు చేస్తుంది. అవసరాన్ని బట్టి ఎఫ్ఆర్ఐ వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వెళ్ళిపోతోంది. ఎస్పీ కార్యాల యమే కాకుండా అన్ని పోలీస్ స్టేషన్లలో కూడా ఈ విధానం ఏర్పాటు చేశారు.



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఫిర్యాదు చేస్తున్న మహిళ

రోడ్డు ప్రమాదాల నివారణలో..

ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తారు. సాధారణంగా అక్కడ ఉన్న వాహనాల పరిస్థితిని బట్టి కేసు నమోదు చేస్తారు. ప్రస్తుతం జిల్లా పోలీస్ శాఖలో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కు సంఘటనా స్థలంలోని ఫోటోలు తీసి అప్‌లోడ్ చేస్తే వెంటనే ఆ ప్రమాదం ఎలా జరిగింది..? అక్కడ ఏఏ వస్తువులు ఉన్నాయి..? ఎంత దూరంలో పడిపోయాయి..? వంటి పూర్తిస్థాయి వివరాలు తెలియజేస్తుంది. ప్రమా దానికి కారణాలను కూడా సూచిస్తుంది. దీంతోనే జిల్లాలో ఎక్కడె క్కడ బ్లాక్ స్పాట్స్ ఉన్నాయో త్వరితగతిన గుర్తించి ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ చర్యలు చేపట్టింది. రహదారులపై కాని, ఏలూరు నగరంలో ఎక్కడైనా వాహనాలను రాంగ్ పార్కింగ్ చేస్తే డ్రోన్ కెమెరా అక్కడకు వచ్చి రెడ్‌లైట్ వెలుగులు జిమ్ముతూ పోలీస్ సైరన్ వేస్తూ ఆ వాహనం తీయాలంటూ హెచ్చరికలు కూడా చేస్తుంది.

అసాంఘిక శక్తులపై నిఘా

అసాంఘిక శక్తులపై నిఘా పెట్టడానికి డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ఎస్పీ చర్యలు చేపట్టారు. సామాజిక బాధ్యతలో భాగంగా పలు సంస్థలు డ్రోన్ కెమెరాలను పోలీస్ శాఖకు అందజేశాయి. సుమారు ఒక్కో డ్రోన్ కెమెరా ఏడు నుంచి రూ.10 లక్షల వరకూ వ్యయం అవుతుంది. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో నైట్ విజన్ డ్రోన్ కెమెరాలు నాలుగు, సాధారణ డ్రోన్ కెమెరాలు ఏడు పనిచేస్తున్నాయి. డ్రోన్ కెమెరాలు ఆకాశంలో తిరుగుతూ ఎక్కడైనా మద్యం, గంజాయి తాగుతూ ఉన్న వారిని గుర్తిస్తున్నది. అంతేకాకుండా అక్కడ ఉన్న వాహనాల నంబర్లను కూడా గుర్తించి, ఆ వాహనాలు ఎవరివో కూడా క్షణాల్లో డేటాను బయటకు తీసే విధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాప్‌ను డ్రోన్ కెమెరాలకు అనుసంధానం చేశారు. క్షణాల్లో ఆ కెమెరాలు ఫోటోలు తీయడం, వారిలో ఎవరైనా నేరస్తులు ఉంటే అతని నేర చరిత్రను కూడా తెలియజేసే విధంగా ఏఐ పనిచేస్తుంది. బహిరంగ ప్రదేశంలో మద్యం తాగేవారిని నిత్యం డ్రోన్ కెమెరాలు వెంటాడుతున్నాయి. కాలేజీలు, స్కూల్స్ వద్ద ఈవ్ టీజింగ్‌కు పాల్పడే ముఠాలను గుర్తించడానికి డ్రోన్ కెమెరాలు పనిచేస్తున్నాయి.



డ్రోన్ కెమెరాతో కళాశాల వద్ద నిఘా

డ్రోన్ రాకతో తగ్గిన నేరాలు

జిల్లాలో ఏర్పాటు చేసిన ఫేస్ రికగ్నైజేషన్ కెమెరాల ద్వారా 170 మంది నేరస్తులను గుర్తించారు. 400 నాన్ బెయిలబుల్ వారెంట్లను అమలు చేశారు. ఫింగర్ ప్రింట్ ద్వారా 132 మంది నేరస్తులను గుర్తించి వారి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. డ్రోన్ల ద్వారా ఈవ్‌టీజింగ్ కేసులు, పోక్సో కేసులను తగ్గించారు. రాత్రి వేళలో కూడా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిని గుర్తించి అరెస్టు చేశారు. 12 గంజాయి కేసులు నమోదు చేసి 498 కేజీల గంజాయి (సుమారు రూ.46 లక్షలు విలువ) స్వాధీనం చేసుకుని 48 మందిని అరెస్టు చేసి 10 వాహనాలను సీజ్ చేశారు.

యాప్ రూపొందించిన ఎస్పీ

ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఖరగ్‌పూర్ ఐఐటీలో ఇంజనీరింగ్ పూర్తిచేశారు.. కొన్నాళ్లు బెంగుళూరులో ఒక కంపెనీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేశారు. ప్రజలకు సేవ చేయాలనే తపనతో ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్)ను సాధించారు. తాను పనిచేస్తున్న పోలీస్ శాఖలోనే అధునాతన, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజలకు భద్రత, మెరుగైన సేవలు అందించాలని ఆలోచించారు. దీంతో రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా ఏలూరు జిల్లాలో టెక్నాలజీతో ఆర్టిఫిషియల్ విభాగంతో పోలీస్ శాఖ సేవలను అంది స్తున్నది. రాష్ట్ర పోలీస్‌శాఖలో ఈ జిల్లాలో జరుగుతున్న ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ పైనే తీవ్ర చర్చ నడుస్తుంది. ఎస్పీ శివకిషోర్ స్వయంగా డీకోడింగ్ యాప్‌లను తయారు చేసి జిల్లా పోలీసు శాఖలో టెక్నాలజీ వాడి అధునాతన సేవలందిస్తున్నారు.

ప్రజల భద్రతే ధ్యేయం : ఎస్పీ



జిల్లాలోని ప్రజలకు, వారి ఆస్తులకు భద్రత కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. ఒక్క పైసా ఖర్చు లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ డీకోడింగ్ చేసి వినియోగించుకుంటున్నాం. జిల్లాలో నేరస్తులు ఎటు నుంచి ఎటు కదిలినా ఫేస్ రికగ్నైజేషన్ కెమెరాలు వారి కదలికలను తెలియేస్తూ ఉంటాయి. ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా, ట్రాఫిక్‌కు అంతరాయం కల్గినా డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి సత్వర చర్యలు తీసుకుంటాం. శక్తిటీమ్‌లతో మహిళలు, బాలల బాలికలకు రక్షణ నిమిత్తం నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నారు. వారితో పాటు డ్రోన్ కెమెరాలు కూడా నిఘాలో ఉంటున్నాయి.

భూ సారమే రైతుకు రక్ష



వేసవిలో వేసిన జీలుగ చేను

ఎరువు వినియోగం తగ్గించే ప్రయత్నాల్లో అన్నదాతలు

వేసవిలో జీలుగు, జనుము, పిల్లిపెసర సాగు

మొక్కలుగా ఉండగానే దుక్కులు



భూసార పంటలతో దుక్కు చేసినభూమి

భీమవరం రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వరిసాగులో దిగుబడులు సాధించడంలో భేష్ అనిపించుకుంటున్న రైతాంగం భూసారాన్ని పెంచి ఎరువుల వాడకం తగ్గించే ఆలోచనలు చేస్తున్నారు. ఇరవై ఏళ్ల క్రితం సాగు విధానం అమలు చేసే ప్రయత్నాలు మొదలు పెట్టారు.గడిచిన వేసవిలో భూసారం పెంచేలా పంటలు వేశారు. జీలుగ, జనుము, పిల్లిపెసర వంటివి సాగు చేశారు. మొక్కలుగా ఉండగానే ట్రాక్టర్‌లతో దమ్ము చేసి భూసారాన్ని పెంచుతున్నారు. దీని ద్వారా ఎరువులు వినియోగం తుగ్గుతుంది. గడిచిన కొన్నేళ్ళుగా ఎరువులు తగ్గించాలని వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తలు రైతులకు చెబుతూ వస్తున్నారు. సేంద్రియ సాగుపై సూచనలు ఇస్తున్నారు. ఎరువుల వాడకం వల్ల కలుగుతున్న నష్టాలను గుర్తించిన రైతాంగం వాటిని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఈసారికి ఎరువులు సిద్ధం

ఈ ఏడాది సార్వా సాగు జిల్లాలో 2 లక్షల 8 వేల ఎకరాల్లో సాగనుంది. దానికి సంబంధించిన పది వేల ఎకరాలలో నారు మడులు వేశారు. సార్వా సాగుకు 58,908 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. యూరియా 21,270 టన్నులు, డీఏపీ 2392 టన్నులు, ఎంవోపీ 5,387 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 23,464 టన్నులు అవసరం ఉంటుంది. దాంతోపాటు ఎస్ఎస్‌పీ 6,391 టన్నులు ఉండాలి. వీటిలో 43,886 మెట్రిక్ టన్నులు ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. ఇంకా 23,445 టన్నులు ఏర్పాటు చేయాలి.

సహజ పద్ధతులతో భూసారం

కొన్నేళ్ల క్రితం సార్వా పంటలో ఎరువుల వాడకం చాలా తక్కువగా ఉండేది. ఎకరానికి యూరియా 30 కేజీలు, కాంప్లెక్స్ 30 కేజీలు వేసేవారు. ఇప్పుడు 80 కేజీలు యూరియా, కాంప్లెక్స్ 80 కేజీలు వేస్తున్నారు. దీంతో అన్ని తెగుళ్ల వ్యాపిస్తున్నాయి. అప్పట్లో భూసారం ఉండేది. పశువుల పేడ, పెంటగా వేసేవారు. వేసవికి జీలుగు, జనుము పండించేవారు. వాటి మొదలు వేళ్లలో ఉన్న దుంపలు భూమిని గుల్ల చేసి భూసారాన్ని పెంచుతాయి. దాంతో పాటు ఆరుతడి పంటలైన పెసలు, మినుములు, పండించి కాయలు కోసి మొక్కలు భూమిలో దున్నేసేవారు. ఇప్పుడు అదే విధానంలోకి రైతులు కొద్దికొద్దిగా వెళ్తున్నారు. భూసారాన్ని పెంచాలనుకుంటున్నారు.

ఎరువుల వినియోగంతో తెగుళ్ల బెడద

వరిసాగులో ఎరువులు అధికంగా వాడటం వల్ల తెగుళ్లు వస్తాయి. ప్రధానంగా యూరియా ఎక్కువ వాడటం వల్ల ఆకుముడత వస్తుంది. ఇది పిలక తొడిగే దశ నుంచి ఈనిక పూర్తయ్యే వరకు పలుమార్లు వస్తుంది. మొవ్వ తెగులు, ఎండాకు తెగులు వస్తాయి. అందుకనే కేంద్ర ప్రభుత్వం యూరియా సరఫరా తగ్గించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

పెట్టుబడి భారమే

ఎరువులు అధికంగా వాడటం వల్ల పెట్టుబడి భారం అవుతుంది. కాంప్లెక్ ఎరువు 50 కేజీల బస్తా రూ. 2 వేలు వరకు ధర ఉంటుంది. రెండు బస్తాలు వాడితే రూ. 4 వేలు పెట్టుబడి అవు తుంది. పంట ఎదుగుదల ఎలా ఉన్నా తెగుళ్లు వచ్చి పురుగు మందులకు రూ. 4 వేలు పెట్టుబడి అవుతుంది. దీంతో ఎకరానికి రూ. 8 వేల వరకు అధిక పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. అదే భూసారాన్ని పెంచుకుంటే రూ. 8 వేలు ఆదా అవుతుంది. దిగుబడి బాగుంటుంది.

ఎంత తక్కువ వాడితే అంత మంచిది



ఎరువులు తక్కువ వాడిన పంట దిగుబడి బాగుంటుంది. తెగుళ్ల ఆశించవు. సార్వా సాగులో ఎరువులు ఎక్కువ ఉపయోగిస్తే వర్షపు ముంపులు వస్తే పంట చనిపోతుంది. ఎరువులు తక్కువ వాడితే ముంపులో కూడా వరిదుబ్బులు దెబ్బతినవు.

కె.జనార్ధన్, రైతు



ఓరియంటేషన్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్

21 నుంచి ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు తరగతులు

నూజివీడు టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీలో పీయూసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ మాట్లాడుతూ నూతనంగా పీయూసీలో చేరిన విద్యార్థులు క్యాంపస్ పద్ధతులను తెలుసుకొని, వాటికి అలవాటుపడి మసులుకోవాలని, బాధ్యతతో వ్యవహరిస్తూ మంచి భవిష్యత్‌కు దారులు వేసుకోవాలన్నారు. ఈనెల 21 నుంచి క్రమంగా అకడమిక్ షెడ్యూల్ ప్రకారం తరగతులు జరుగుతాయని, 28 నుంచి స్టడీ అవర్స్ ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు స్నేహభావంతో మెలగాలన్నారు. క్యాంపస్‌లో అమ్మాయిల పట్ల అనుచితంగా ప్రవర్తించినా, ఇతర విద్యార్థుల్ని ర్యాగింగ్ చేసినట్లు తమ దృష్టికి వచ్చినా విద్యార్థులకు క్యాంపస్‌లో అదే ఆఖరిరోజు అవుతుందని హెచ్చరించారు. డీన్ అకడమిక్స్ డాక్టర్ చిరంజీవి మాట్లాడుతూ మొదటి రెండు సంవత్సరాలు పీయూసీ, ఆ తరువాత నాలుగు సంవత్సరాలు బీటెక్ కోర్సు చదవాల్సి ఉంటుందని, పీయూసీలో సంవత్సరాంతానికి, ఇంజనీరింగ్‌లో సెమిస్టర్ విధానంలో పరీక్షలు జరుగుతాయని, పీయూసీ విద్యార్థులకు ఆరు మాసాంత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అందులో నాలుగు మాసాంతర పరీక్షల్లో వచ్చిన మార్కులను పరిగణలోకి తీసుకుంటామని, ఆర్జీయూకేటీ ప్రవేశాలలో పాటించిన రిజర్వేషన్ విధానమే ఇంజనీరింగ్‌లో కేటాయించే బ్రాంచ్‌లకు కూడా వర్తిస్తుందని, విద్యార్థులు కష్టపడి చదివి రెమెడియల్ లేకుండా చూసుకోవాలన్నారు. పరిపాలన అధికారి డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యా సంస్థ ఆస్తులను పాడు చేసిన వాళ్ళకు ఫైన్ విధిస్తామన్నారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఫర్ బాయ్స్ డా.రాజేష్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఫర్ గరల్స్ డా.దుర్గాభవాని, చీఫ్ వార్డెన్ బి. సురేష్‌బాబు పాల్గొని హాస్టల్స్ విషయంలో విద్యార్థులు జాగ్రత్తగా ఎలా ప్రవర్తించాలో తెలియజేశారు. అసోసియేట్ డీన్స్ భరత్, రఘు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో రోడ్లు ఛిద్రం

ఉంగుటూరు మండలంలోని మెట్ట ప్రాంతంలోని పంట భూములలోకి వెళ్ళేందుకు కైకరం నుంచి అక్కుపల్లి గోకవరం-కంసాలి గుంట గ్రామాల మధ్య సుమారు రూ.రెండు కోట్లతో తారు రోడ్డు నిర్మించారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అధ్వానంగా తయారైంది. ఈ రహదారిలో పంట పొలాలు ఉండడంతో నిత్యం ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు తిరుగుతుంటాయి. ఈ రహదారి ద్వారా మెట్ట ప్రాంతంలోని గ్రామాలకు కేవలం ఐదు కిలో మీటర్లు దూరం ఉండగా రైతులు, ప్రజలకు ఉపయోగ పడుతున్నది. అయితే ఈ రోడ్డుపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు తిరుగుతుండంతో పాడైపోతున్నది. వర్షాకాలం కావడంతో బురద మయంగా మారి పాడవుతున్నదని రైతులు వాపోతున్నారు. దీనిపై అధికారులు దృష్టి పెట్టి రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

- ఉంగుటూరు(ఆంధ్రజ్యోతి)





మాట్లాడుతున్న ఎస్సీ కులాల జాతీయ కమిషన్ మెంబర్ రామచందర్

పేదల అభ్యున్నతికి అధికారులు పాటుపడాలి

భీమవరం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల ఉపాధి అవకాశాలు మెరుగుదలకు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ మెంబరు (న్యూఢిల్లీ) వడ్డేపల్లి రామచందర్ సూచించారు. షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ మెంబరు (న్యూఢిల్లీ) రామచందర్‌తో పాటు షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ డైరెక్టర్ (హైదరాబాద్) సునీల్ కుమార్ బాబు సంయుక్తంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో షెడ్యూల్డ్ కులాల వారికి అమలు చేస్తున్న సబ్సిడీ బ్యాంకు రుణాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎవరి ప్రలోభాలకు లొంగకుండా నిబద్ధతతో అధికార యంత్రాంగం పనిచేసి పేద వర్గాల అభ్యున్నతికి పాటుపడాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై కమిషన్ తగు చర్యలు తీసుకోవడానికి వెనుకాడదన్నారు. సమావేశానికి జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించగా, రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, అడిషనల్ ఎస్పీ వి.భీమారావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరుపాడులో విజిలెన్స్ తనిఖీలు

కాళ్ళ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరుపాడు గ్రామంలో విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో శ్రీ వెంకటరమణ ఏజెన్సీలో తనిఖీలు నిర్వహించినట్లు కాళ్ళ మండల వ్యవసాయ అధికారి రమేష్ నాయుడు తెలిపారు. ఈ షాపులో ఎరువులు, యూరియా నిల్వలను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా రూ. 25 వేలు విలువైన 500 కేజీల జింకును గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఐ. గోపాలకృష్ణ, సాంకేతిక వ్యవసాయ అధికారి, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ కె.కృష్ణకాంత్, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాలిసెట్ చివరి కౌన్సెలింగ్

నరసాపురం రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ చివరి కౌన్సిలింగ్ ఈనెల 17 నుంచి కొనసాగుతుందని, దీనికి సంబంధించిన షెడ్యూల్ విడుదల అయినట్లు స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్మయి తెలిపారు. ఆన్‌లైన్‌లో 17 నుంచి 19 వరకు ఫీజు చెల్లించవచ్చునన్నారు. 20 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన, ఆప్షన్ నమోదు ప్రక్రియ ఉంటుందన్నారు. 21న సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. సీటు పొందిన విద్యార్థులు 24లోపు రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు.

న్యాయం చేయాలంటూ నిరసన



ఆకివీడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : న్యాయం చేయాలంటూ మాచిపోగుల కోటేశ్వరరావు అనే వ్యక్తి నగర పంచాయతీ కార్యాలయం దగ్గర ఆందోళనకు దిగాడు. 2017-18లో 18 మందిలో 13 మంది పంచాయతీ కార్మికులతో పాటు ఇతరులు ఐదుగురికి పాసింజర్ ఆటోలు ప్రభుత్వ సబ్సిడీపై వస్తున్నాయని చెప్పడంతో బ్యాంకుకు వెళ్ళి సంతకాలు చేశామన్నాడు. అయితే పాసింజర్ ఆటోలు కాకుండా గ్రీన్ వెహికల్స్ వచ్చాయని, దానిని తాము అప్పుడే తిరస్కరించామన్నాడు. అప్పటి కార్యదర్శి సబ్సిడీ పోను మిగిలిన నగదుకు సంబంధించి నాలుగు నెలలు చెల్లించారన్నాడు. మిగిలినది నేటికి బ్యాంకుకు చెల్లించకపోవడంతో 18 మందికి ఎటువంటి లోన్లు తీసుకోవాలన్నా బ్యాంకుల అధికారులు ఇవ్వకపోతుండడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నాడు. ఈ విషయంపై అప్పటి నుంచి అధికారులు, పాలకవర్గాల దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోవడం లేదన్నాడు. దీంతో మంగళవారం మండుటెండలో మూతికి నలుపు రిబ్బను కట్టుకొని నిరసన తెలిపాడు.

మరింత తగ్గిన వరద గోదావరి

ఆచంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉధృతి మరింత తగ్గింది. మంగళవారం నాటికి గోదావరి ప్రవాహం మరింత తగ్గడంతో పుష్కరఘాట్‌లు బయటపడుతున్నాయి. పుష్కరఘాట్‌లలో బురద మట్టి చేరింది. గోదావరి ప్రవాహం తగ్గడంతో పడవలు రాకపోకలు యథావిధిగా తిరుగుతున్నాయి.

గ్రహణం మొర్రి వారికి ఉచిత శస్త్ర చికిత్స

ఆచంట, జూలై15(ఆంధ్రజ్యోతి):ఈ నెల 21న పెనుగొండ పంచాయతీ వద్ద నిర్వహించే నియోజకవర్గ స్థాయి దివ్యాంగుల ఉపకరణాల నిర్ధారణ, శారీరకంగా, దృష్టిపరంగా వైకల్యం ఉన్న వారికి సుమారు రూ.3 లక్షలు ఖర్చు అయ్యే శస్త్ర చికిత్స ఉచితంగా చేసేందుకు వివరాలు నమోదు చేస్తారని ఎంపీడీవో కృష్ణమోహన్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో సమావేశం నిర్వహించారు.

ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ప్రభుత్వ పెన్షన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.కేంద్రంలో ఎనిమిదవ పే కమిషన్, మన రాష్ట్రంలో 12వ పే కమిషన్ వెంటనే నియమించాలన్నారు. ఐ.ఆర్. 30 శాతం ప్రకటించాలన్నారు. పెండింగులో ఉన్న డి.ఆర్. బకాయిలను తక్షణం చెల్లించాలి డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సీహెచ్ పట్టాభి రామయ్య ధర్నాకు సంఘీభావం తెలిపారు.అనంతరం జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందించారు.

ఆలయాల్లో నరేంద్ర, రామరాజు పూజలు



మావుళ్ళమ్మను దర్శించుకున్న నరేంద్ర, రామరాజు

భీమవరం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు దంపతులు, పొన్నూరు ఎమ్మెల్యే, సంఘం డైరీ చైర్మన్ ధూళిపాల నరేంద్ర దంపతులు మంగళవారం మావుళ్ళమ్మ అమ్మవారిని, పంచారామ క్షేత్రమైన సోమేశ్వర స్వామివారిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు.

సాంకేతికతతో ఆర్థిక ప్రగతి సాధించాలి

కాళ్ళ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పెద అమిరం గ్రామంలో ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో 'గ్రామీణ ప్రజల జీవనోపాధిని మార్చడం' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతానికి చెందిన ఎస్సీ, బీసీ, బలహీన వర్గాల అభ్యున్నతికి కళాశాలల ద్వారా అందిస్తున్న సాంకేతిక సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధానంగా వాటర్ క్వాలిటీ టెస్టింగ్, పర్యావరణ అనుకూలమైన ఆక్వా మేతలు స్థానికంగా తయారు చేయడం, చేప నుంచి నూనె తీయడం వంటి వాటిలో ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లేబొరేటరీస్‌లోనే శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.స్వాతి, జి.హరీష్‌కుమార్ వర్మ, టి. వంశీ నాగరాజు, బద్రిరాజు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం



తాడేపల్లిగూడెంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మట్లాడుతున్న మంత్రి నారాయణ

» వైసీపీ ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్లు అప్పు చేసి వెళ్లింది
» రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్న సీఎం చంద్రబాబు
» మంత్రి పొంగూరి నారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం నెరవేరుస్తోందని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం విధ్వంస పాలనా విధానాలతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేసిందని, అనుభవజ్ఞుడైన సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. మంగళవారం పట్టణంలోని 19వ వార్డులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ పాలనా విధానాలతో రాష్ట్రం ఊబిలో కూరుకుపోయిందని, రూ. 10 లక్షల కోట్లు గత వైసీపీ ప్రభుత్వం అప్పులు చేసిందన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావల్సిన ఎన్నో ప్రాజెక్టులను వైసీపీ రాకుండా చేసిందని దుయ్యబట్టారు. తాను 2014లో మంత్రిగా ఉన్నప్పుడు 2019 ఫిబ్రవరిలో కేంద్రం నుంచి ఇంటింటికి కుళాయి కనెక్షన్ల కోసం రూ. 5,350 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించామని, వీటిలో 70 శాతం కేంద్రం భరించాల్సి ఉండగా మిగిలిన 30 శాతం రాష్ట్రం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అయితే అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు మంజూరైనా రాష్ట్రం నుంచి ఇవ్వాల్సినవి ఇవ్వకుండా వాటిని నిర్వీర్యం చేసిందన్నారు. అలాగే ఇంటింటికి తాగునీరు అందించేందుకు గాను అమృత్ స్కీంలో గత తమ ప్రభుత్వ హయాంలో రూ. 8500 కోట్లు మంజూరు చేయించినప్పటికి వైసీపీ విధానాల కారణంగా ఆ నిధులు కూడా వెనక్కి మళ్ళి పోయాయన్నారు. అలా వెళ్ళిపోయిన నిధులన్నింటికి తిరిగి రాబట్టేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆ నిధులు వస్తే తాడేపల్లిగూడెంలో పైపులైన్లు, రెండవ సమ్మర్ స్టోరేజ్ తదితర పనుల కోసం సుమారు 200 కోట్లు మంజూరు అవుతాయన్నారు.

19వ వార్డు ప్రజలకు మంత్రి వరాలు

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పట్టణంలోని 19వ వార్డులో పర్యటించిన మంత్రికి నారాయణకు స్థానిక మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. అలాగే తమ సమస్యలను మంత్రికి చెప్పుకున్నారు. తమ వార్డులో ప్రధాన డ్రైనేజీ అసలు బాగోలేదని దీనివల్ల తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తక్షణం స్పందించిన మంత్రి అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ ఏసుబాబుతో మాట్లాడారు. ఆ డ్రైనేజీ నిర్మాణం జరగాలంటే రూ. 85 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో వెంటనే మంజూరు చేయిస్తానంటూ మంత్రి హామీ ఇచ్చారు. అలాగే అదే వార్డులో 3 సీసీ రహదారులకు గాను రూ. 2 కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో బాబ్జి మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రిని సత్కరించారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, పరిమి రవికుమార్, పద్మనాభుని మురళి, దాట్ల జగన్నాథరాజు తదితరులు పాల్గొన్నారు.

దిద్దుబాట్లు.. లేదంటే పాట్లే!

కౌన్సెలింగ్ సిబ్బంది తప్పిదాలు.. ఏఎన్ఎంలకు గ్రహపాట్లు?

ఏలూరు అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఇటీవల నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌లో చోటుచేసుకున్న అవాంఛనీయ పరిణామాలు, వాటిని సరిదిద్దేందుకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు బిజీగా ఉన్నట్టు తెలిసింది. కౌన్సెలింగ్‌లో పలువురికి రెండు, మూడు స్థానాలను కేటాయించినట్టు రుజువుకావడం, ఆయా నూతన స్థానాలకు ఖరారైన అభీష్టానికి భిన్నంగా బదిలీ స్థానాలను జాబితాల్లో పేర్కొనడం తదితర తప్పిదాలను గుర్తించిన ఏఎన్ఎంలు లబోదిబోమంటూ డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఫిర్యాదులతో గుంపులుగా తరలివచ్చిన విషయం విదితమే. కాగా కౌన్సెలింగ్, జాబితాల్లో చోటు చేసుకున్న తప్పిదాలన్నీ కేవలం సాంకేతిక సమస్యల వల్లే జరిగాయని ఏఎన్ఎంలకు సర్దిచెప్పే ప్రయత్నాలను వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు చేస్తున్నట్టు తెలిసింది. మరోవైపు బదిలీల్లో జరిగిన లోపాలను కప్పిపుచ్చుకునే చర్యల్లో భాగంగా దిద్దుబాట్లు, బుజ్జగింపులతోపాటు ఒకింత బెదిరింపు ధోరణులకు కూడా దిగుతున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా కౌన్సెలింగ్ సిబ్బంది తప్పిదాల వల్ల ఖరారైన బదిలీ స్థానాలను సమీపంలోని మరో స్థానానికి మార్చుకోవడానికి ఒప్పించడం లేదంటే ఉద్యోగ సంబంధిత కార్యకలాపాల రికార్డులు, రిజిస్టర్లు, డైరీల తనిఖీల పేరుతో వేధింపులు తప్పవని బెదిరింపులకు దిగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. పని ఒత్తిడిలో పలువురు ఏఎన్ఎంలు ఉద్యోగ సంబంధ కార్యకలాపాలను రెగ్యులర్‌గా నమోదుచేయని వారే ఎక్కువమంది ఉంటారని, ఇవే వెనుకబాట్లు, బలహీనతలు తాజాగా బదిలీల్లో కార్యాలయ సిబ్బంది పొరపాట్లను సరి దిద్దడానికి ఆయుధాలుగా వాడుకుంటున్నారని మరో ప్రచారం ఉంది. బదిలీల రీ-కౌన్సెలింగ్‌కు సాంకేతికంగా అవకాశం, అనుమతులు ఉన్నతాధికారుల నుంచి రాబోవని సంకేతాలు అందుతుండటంతో ఇక తప్పిదాలను దిద్దుకోవడం తప్ప మరో మార్గం లేదని సమాచారం. దీనికనుగుణంగానే ఉమ్మడి జిల్లాలో సుమారు 170 మంది వరకు బదిలీల్లో పొరపాట్లు దొర్లినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, ఏఎన్ఎంల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి బుధవారం నాటికి సమస్యను పరిష్కరించాలని డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. సవరించిన బదిలీ స్థానాల ఆర్డర్లపై ఇటీవల జిల్లా నుంచి బదిలీ అయిన అధికారి సంతకం చేస్తారా లేక ప్రస్తుత అధికారి ఆమోద ముద్ర వేస్తారా అనేదానిపై సందిగ్ధత తలెత్తినట్టు సమాచారం. కాగా బదిలీల్లో మార్గదర్శకాలు పాటించకపోవడం, చోటుచేసుకున్న తప్పిదాల వల్ల జరిగిన నష్టంపై కొందరు ఏఎన్ఎంలు న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్టు ప్రచారం జరుగుతోంది.

ఎంటీఎస్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రెగ్యులర్ టీచర్లతో సమానంగా విద్యా బోధన చేస్తున్న డీఎస్సీ-1998 కనీస వేతన స్కేలు(ఎంటీఎస్) ఉపాధ్యాయులకు జీతాలను పెంచాలని ఎంటీఎస్ టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.ఎడ్వర్డ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సెలక్షన్ జోన్‌లోకి వచ్చినప్పటికీ తుది ఎంపికల్లో నష్టపోయిన డీఎస్సీ-98 టీచర్లు 25 ఏళ్ల సర్వీసును కోల్పోయారని, ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఎంటీఎస్ ఉపాధ్యాయులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం ఒక్కో ఎంటీఎస్ టీచరుకు నెలకు రూ.32,470ల జీతం తప్ప, ఎటువంటి హెచ్ఆర్ఏ, డీఏ, టీఏలు తమకు చెల్లించదని వివరించారు. దూరప్రాంతాల నుంచి రాకపోకలకే జీతంలో సగానికిపైగా ప్రయాణ ఖర్చులుగా భరిస్తున్నామని పేర్కొన్నారు. మిగతా ఉపాధ్యాయులు, ఉద్యోగుల మాదిరిగా ఎంటీఎస్ టీచర్లు మరణిస్తే ఎటువంటి మట్టి ఖర్చులను కూడా ప్రభుత్వం చెల్లించకపోవడంతో, ఎవరైనా మరణిస్తే తమలో తాము చందాలు వేసుకుని పేద ఉపాధ్యాయ కుటుంబాలకు చెల్లిస్తున్నామన్నారు. మిగతా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలతో సమానంగా ప్రభుత్వం ఎంటీఎస్ టీచర్ల సమస్యలను పరిష్కరించి వారికి చేసే అన్ని ప్రయోజనాలను తమకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

వేలం కేంద్రాలను సందర్శించిన పొగాకు బోర్డు చైర్మన్



జంగారెడ్డిగూడెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జంగా రెడ్డి గూడెం పొగాకు వేలం కేంద్రాలను పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ మంగళవారం సందర్శించారు. వేలం కేంద్ర అధికారులు జె.సురేంద్ర, బి.శ్రీహరి, రైతు సంఘాల నాయకులు పరిమి రాంబాబు, సత్రం వెంకట్రావు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆర్ఎం జీఎల్‌కె ప్రసాద్ తో కలసి చైర్మన్ యశ్వంత్ కుమార్ రెండు పొగాకు వేలం కేంద్రాల్లో వేలం సరళిని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతుల సమస్యలు పరిష్కరిం చాలని వినతి పత్రం ఇచ్చారు. రైతులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వల్పంగా వర్జీనియా పొగాకు ధరల పెరుగుదల

మంగళవారం జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రం-18లో క్వాలిటీ పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.359 కు చేరగా లో-గ్రేడ్ పొగాకు కనిష్ఠ ధర కేవలం రూ.200 దగ్గరే నిలిచి పోయింది. ఈ కేంద్రంలో ఇప్పటి వరకు సరాసరి ధర రూ.277.62గా ఉంది. అలాగే వేలం కేంద్రం-32 లో క్వాలిటీ పొగాకు గరిష్ఠ ధర రూ.358 కు చేరుకోగా లో గ్రేడు పొగాకు కనిష్ఠ ధర రూ.200 వద్దే ఉంది.ఇప్పటి వరకు సరాసరి ధర రూ.275.92 గా ఉంది. సరాసరి ధర రూ.350 కు పైగా ఉంటేనే రైతులు గట్టెక్కే పరిస్థితులు కనబడుతున్నాయని లేదంటే పొగాకు రైతులు అప్పుల పాలయ్యే పరిస్థితి నెలకొంటుందని రైతు సంఘ నాయకులు వాపోతున్నారు.

2 రోజుల్లో ఎంపీహెచ్ఏ (మేల్) ఉద్యోగులకు పని సర్దుబాటు

ఏలూరు అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఎంపీహెచ్ఏ(మేల్) ఉద్యోగుల సేవలను మలేరియా, డెంగీ ప్రభావితప్రాంతాలు, తాగు నీటి వనరుల కాలుష్య ప్రాంతాల్లో తాత్కాలిక ప్రాతిపదికన (వర్క్ అడ్జస్టమెంట్) వినియోగించుకునేందుకు కౌన్సెలింగ్‌ను గురువారం లేదా శుక్రవారాల్లో నిర్వ హించనున్నారు. వాస్తవానికి ఈ పని సర్దుబాటుకు సంబంధించి ఏప్రిల్ 16నే ప్రభుత్వం జీవోను జారీ చేయగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇప్పటికే కౌన్సెలింగ్ పూర్తయింది. ఉమ్మడి జిల్లాలో మాత్రం సీనియార్టీ జాబితాలను విడుదల చేసి, వాటిలో తప్పులు దొర్లాయన్న ఆరోపణలు రావడంతో నిలిపివేశారు. ఈ క్రమంలోనే ఇటీవల కొత్తగా డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పీజే అమృతంకు వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ తొలి టాస్క్‌గా ఎంపీహెచ్ఏ (మేల్) ఉద్యోగుల వర్క్ అడ్జస్టమెంట్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఆ మేరకు జాతీయ కీటక జనిత వ్యాధుల వ్యాప్తి నియంత్రణ కార్యక్రమాన్ని (ఎన్‌వీబీడీసీపీ) ఉమ్మడి జిల్లాలో అమలు చేసేందుకు 154 మంది రెగ్యులర్, 122 మంది కాంట్రాక్టు ఎంపీహెచ్ఏ(మేల్) ఉద్యోగులకు నిర్వహించే వర్క్ అడ్జస్ట్ మెంట్ కౌన్సెలింగ్‌ను మాన్యువల్ పద్ధతిలో ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయానికి పిలిపించి ముఖాముఖిగా చేపట్టాలా లేదా జూమ్ విధానంలో జరపాలా అనే విషయంపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నారు. వీరందరినీ జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో తాత్కాలిక ప్రాతిపదిన పని సర్దుబాటుపై నియమిస్తారు.

పేకాట స్థావరంపై దాడి రూ.40,500 నగదు సీజ్

టి.నర్సాపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): వల్లంపట్ల పంచాయతీ పరిధిలోని సింగరాయపాలెం గ్రామ శివారులో పోలీసులు పేకాట శిబిరంపై మంగళవారం దాడులు నిర్వహించి 8మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.40,500 నగదును, 12మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. ఎం.జయబాబు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ రాజు, పీసీ నాగబాబు పాల్గొన్నారు.

గుండుగొలనులో యువతి ఆత్మహత్య



భీమడోలు, జూలై 15(ఆంధ్రజ్యోతి): గుండుగొలనులో ఉరివేసుకుని యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈనెల 13న సిరికోటి నర్మద (20) ఉదయం 10 గంటలకు ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి అమ్మమ్మ కుమార మాణిక్యం ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని, ప్రేమ వ్యవహారమే కారణంగా అనుమానిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

యనమదుర్రు డ్రెయిన్‌లో ఓ వ్యక్తి దూకినట్టు అనుమానం

భీమవరం క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డులో ఉన్న వంతెనపై నుంచి యనమదుర్రు డ్రెయిన్‌లోకి ఓ వ్యక్తి దూకాడంటూ కలకలం రేగింది. నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి వంతెనపై పాదరక్షలు వదిలి డ్రెయిన్‌లో దూకినట్టు కొందరు చెబుతున్నారు. దీంతో స్థానికులు, పోలీసులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. అయితే ఎవరనేది తేలియరాలేదు. నిజంగానే దూకారా.. లేదా అనేది తేలాల్సి ఉంది. అయితే పోలీసులు వివరాలు సేకరించే పనిలో పడ్డారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

భీమవరం క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి కాల్వలో పడటంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించినా ఫలితం దక్కలేదు.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. టూటౌన్ ఎస్ఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం రెండవ పట్టణంలోని సత్యవతి నగర్‌కు చెందిన గుమ్మడి రామచంద్రరావు(34) కొంత కాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 13న బహిర్భూమికని బయటకు వెళ్లగా అక్కడ ఫిట్స్ రావడంతో కాలువలో పడిపోయాడు. కొందరు చూసి అతడిని బయటకు తీసి ఆసుపత్రిలో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుని తల్లి రత్నకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కాలువలో కూలిన చెట్ల తొలగింపు

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

మొగల్తూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): సాగు నీరందక సార్వా నారుమడులు ఎండిపోతున్నాయంటూ 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన వార్తకు సాగునీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ సిబ్బంది స్పందించారు. మొగల్తూరు న్యూ చానల్ ఆయకట్టు పరిధిలో శివారు ప్రాంతాలకు సాగునీరందక నారుమడులు ఎండిపోవడంపై వచ్చిన కథనం నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నరసాపురం నుంచి మొగల్తూరుకు వచ్చే ప్రధాన కాలువలో ఇటీవల చెట్లు కూలి కాలువలో పడటంతో నీటి ప్రవాహం ఆగినట్టు గుర్తించిన అధికారులు మంగళవారం కాలువలో కూలిన చెట్లు తొలగింపు పనులు చేపట్టారు.



మొగల్తూరు ప్రధాన కాలువలో చెట్లు తొలగిస్తున్న దృశ్యం

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఉత్తమం

సీనియర్ సివిల్ జడ్జి రత్నప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో దోహదపడుతుందని ఏలూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఈనెల 10నుంచి 16వ తేదీ వరకు మధ్యవర్తిత్వం - దేశం కోసం అనే అంశంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా మంగళవారం జిల్లా న్యాయసే వాధికార సంస్థ భవనంలో ఇన్సూరెన్సు కంపెనీ, బ్యాంక్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ఇన్సూరెన్సు క్లైములు, వాహన ప్రమాద బీమా కేసులు, బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన పెండింగ్ కేసులను మధ్యవర్తిత్వం నిర్వహించడం ద్వారా ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని పొందవచ్చన్నారు.అధికారులు పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడానికి కృషి చేయాలన్నారు. ఈ మధ్యవర్తిత్వాన్ని నిర్వహించడానికి తర్ఫీదు పొందిన న్యాయవాదులు జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో అందుబాటులో ఉంటారన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా రాజీ చేసుకోవడంలో ఏమైనా సందేహాలున్న 15100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చన్నారు. సెప్టెంబర్ 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడానికి తగిన ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ పిఎస్‌వి మునేశ్వరరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

ఏలూరు క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన ఒక మహిళ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందింది. ఏలూరుకు చెందిన షేక్ మల్లిక(59) సీఆర్ఆర్ కాలేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఆమెను ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ శస్త్రచికిత్సను జరిపారు. అయితే మంగళవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి ఐసీయులో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పాము కాటుతో ఇద్దరు రైతులకు అస్వస్థత

పోలవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో ఇద్దరు రైతులు అస్వస్థతకు గురైన ఘటన పోలవరం మండలంలో మంగళవారం జరిగింది. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం రాంపాలెం గ్రామానికి చెందిన పుట్టేపు వెంకటమణికంఠ అనే రైతును పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురవడంతో విషానికి విరుగుడు ఇంజెక్షన్ ఇచ్చి చికిత్స అందిస్తున్నట్టు పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ రాంబాబు తెలిపారు. కొత్తపట్టిసీమ గ్రామానికి చెందిన మరో రైతు కోనాల రామశేఖర్‌కి పొడపాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తడంతో మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం సిఫార్సు చేసినట్టు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతున్న ఒక వ్యక్తిని ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏలూరు సమీపంలో వట్లూరు రైల్వే గేటు వద్ద మంగళవారం ఉదయం సుమారు 55 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా అదే సమయంలో అతి వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు తెలుపు రంగు నిలువు చారలు కలిగిన సిమెంటు రంగు పొడవు చేతుల చొక్కా, ముదురు గోధుమ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిస్తే రైల్వే ఎస్ఐ పి.సైమన్(99892 19559)కు సమాచారం అందించాలని కోరారు.

రికవరీ చేసిన సొమ్ము, సెల్‌ఫోన్ అందజేత



నగదు అందజేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి ఏలూరుకు ప్రయాణిస్తున్న ఒక మహిళ సెల్ ఫోన్‌ను దొంగలు అపహరించారు. ఆ ఫోన్ నుంచి సైబర్ నేరగాడు రూ.25 వేలు ఫోన్ ద్వారా తస్కరించారు. బాధితురాలు ఏలూరు సైబర్ సెల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మహిళ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌తో పాటు ఆమె ఫోన్ నుంచి తస్కరించిన రూ.25 వేలను రికవరీ చేశారు. ఆ సొమ్మును ఏలూరు సైబర్ సెల్ సీఐ జి.దాసు బాధితురాలికి మంగళవారం అందజేశారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో తాపీమేస్త్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు అశోక్‌నగర్ ఏటిగట్టు ప్రాంతానికి చెందిన కీర్తి సత్యనారాయణ(45) తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం అనేకచోట్ల అప్పులు చేశాడు. అప్పులు తీర్చేమార్గం కానరాక జీవితంపై విరక్తి చెంది సోమవారం అర్ధరాత్రి ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే సత్యనారాయణ మృతి చెందాడని నిర్ధారించారు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడుపు నొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి బాధ భరించలేక ఒక యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు.పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన కావూరి సాగర్(23) అతని భార్య కలిసి సీతారామపురంలోని గుంటూరు వెంకట్రావు అనే రైతుకు చెందిన ఆవులను మేపడానికి వెళ్ళి అక్కడే ఉంటున్నారు. సాగర్ కడుపునొప్పిని భరించలేక సోమవారం అర్ధరాత్రి తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోగా ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

జువైనల్ కోర్టు నుంచి తప్పించుకున్న బాలల గుర్తింపు

ఏలూరు క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): నగర శివారు శనివారపు పేటలోని ప్రభుత్వ సత్ప్రవర్తన పర్యవేక్షణ వసతి గృహంలో ఉంటూ పరారైన ఐదుగురు బాలలను పోలీసులు గుర్తించారు. వసతి గృహ అధికారులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే వసతిగృహంలో ఉంటున్న చట్టంతో విభేదించిన ఐదుగురు బాలలు ఈనెల 13 రాత్రి అక్కడ నుంచి పరారయ్యారు. దీంతో వసతి గృహ అధికారి ఫిర్యాదు మేరకు త్రి టౌన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. త్రి టౌన్ సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బాలలను గుర్తించే చర్యలు చేపట్టారు. ఐదుగురు బాలల్లో ఇద్దరు భీమవరంలో, జంగారెడ్డిగూడెంలో, తణుకు, తాడేపల్లిగూడెంలో ముగ్గురు బాలలున్నట్టు గుర్తించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని వసతి గృహ అధికారులకు అప్పగించారు.

మహిళను దూషించిన వ్యక్తికి రూ.15వేలు జరిమానా

ఏలూరు క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మహిళ పట్ల అవమానకర వ్యాఖ్యలు చేసినట్టు జ్యోతుల దీపక్ అనే వ్యక్తిపై నేరం రుజువు కావడంతో రూ.15 వేల జరిమానా విధిస్తూ ఏలూరు మొబైల్ కోర్టు తీర్పు చెప్పింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2022లో జ్యోతుల దీపక్ అనే వ్యక్తి ఒక మహిళ ఇంట్లో చొరబడి ఆమెను బెదిరించి ఆమెపై అసభ్యకర వ్యాఖ్యలు చేశాడు. దీంతో ఏలూరు త్రిటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు మొబైల్ కోర్టులో విచారణ సాగగా అతనికి రూ.15 వేల జరిమానా విధించారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఏలూరు సంతోష్‌నగర్‌కు చెందిన దొర నాగేశ్వరరావు(72) మతిస్థిమితం సరిగాలేక జూన్ 5న ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగిరాలేదు. వృద్ధుడికోసం వెతికినప్పటికీ ఆచూకీ కానరాక పోవడంతో టూటౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

ఉచితంగా నోట్‌పుస్తకాల అందజేత

పెదపాడు, జూలై 15(ఆంధ్రజ్యోతి): వడ్డిగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టుగెదర్ ఇండియన్, ట్రీస్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ, స్మార్ట్ సిటీ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలు పంపిణీని ఎంఈవోలు సబ్బితి నరసింహమూర్తి, జంగం రవీంద్రల అధ్యక్షతన మంగళవారం జరిగింది. అనంతరం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేశారు. దిడ్ల యాంజి, సర్పంచి జయమంగళ దేవి, సుబ్బరాజు, షేక్ ముస్తఫా అలీ, జీజేఏ స్టీఫెన్, కాటి వెంకటరమణ, జీవీ వెంకటరమణ, రవికుమార్ పాల్గొన్నారు.

నగరంలో హైస్కూల్ ప్లస్‌ల ఏర్పాటుకు ఎమ్మెల్యేకు వినతి

ఏలూరు అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ హైస్కూల్ ప్లస్‌లను ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేయాలంటూ మంగళవారం రాత్రి ఎమ్మెల్యే బడేటి చంటికి ఏపీటీఎఫ్ నగరశాఖ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. నగరపరిధిలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ముఖ్యంగా బాలికలకు హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటుచేస్తే ఉప యోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యేకు వివరించారు. సంఘ నాయకులు రామారావు, కె.ఆనంద్ కుమార్, ఎ.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

ఏలూరు రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్య పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్యాంబాబు, కె.భవన్నారాయణ మాట్లాడుతూ రావాల్సిన డీఏ ఏరియర్స్, 11వ పి.ఆర్.సి ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈహెచ్ఎస్ కింద వైద్యం అందించాలని, హెల్త్ కార్డుపై అన్ని ఆస్పత్రులలో మెడికల్ రియంబర్స్‌మెంట్ 2లక్షల నుంచి 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్ విభాగానికి సంబంధించిన పెన్షనర్లు అందరికీ మెడికల్ రీయంబర్స్‌మెంట్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజు, ఎం.వెంకటేశ్వరరావు, వి.వి.సుబ్రహ్మణ్యం, ఎస్ఎస్ ప్రతాప్, ఎం.కృష్ణారావు, కేబీఎన్ ఆచార్యులు, వై.శరత్ బాబు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వేతన బకాయిల కోసం నైట్ వాచ్‌మెన్ల ధర్నా



ధర్నాలో పాల్గొన్న నైట్‌వాచ్‌మెన్

ఏలూరు అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో రాత్రిపూట కాపలా దారుగా పనిచేస్తున్నవారికి బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీ ప్రభుత్వ పాఠశాలల నైట్ వాచ్‌మెన్‌ల సంఘం (ఏఐటీయూసీ అనుబంధం)జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘ జిల్లా కార్యదర్శి కె.బుచ్చిబాబు మాట్లాడుతూ గౌరవ వేతనం నెలలతరబడి చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వివరించారు. కనీస వేతనం నెలకు రూ.10 వేలు పెంచాలని కోరారు. ధర్నా అనంతరం డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ అవధానికి వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు కె.వెంకటేష్, బి.జాన్, సీహెచ్.రత్నరాజు, ఎన్.ఇమ్మానియేల్, సీహెచ్.రవికుమార్, చంటియ్య పాల్గొన్నారు.

కోకో రైతుల సమస్యలు పరిష్కరించాలి

ద్వారకాతిరుమల, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉన్న పంటనే కోకో రైతులు ఇబ్బందులు పడుతుంటే అదనంగా మరోలక్ష ఎకరాల్లో కోకో సాగును ప్రోత్సహిస్తామనడం విడ్డూరంగా ఉందని కోకో రైతు సంఘ ఏపీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని పంగిడిగూడెంలో మంగళవారం కోకో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల ప్రాంతీయ సదస్సు జరిగింది. రైతు సంఘం నేత రుద్రరాజు సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో రైతుల సమస్యలపై చర్చించారు. కోకో పంటను మార్కెటింగ్ చేసుకునేలా రైతులు సంఘటితం కావాలన్నారు. కోకో రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, పానుగంటి అచ్యుతరామయ్య, కె.సతీశ్‌బాబు, ఆర్.లింగరాజు, కె.భాస్కరరావు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు ఒక రోజు శిక్షణ

పెదపాడు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రతి బూత్‌లెవల్ అధికారి(బీఎల్‌వో) ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలో పూర్తి క్షేత్రస్థాయి అవగాహన కలిగి ఉండాలని పెదపాడు తహసీల్దారు కృష్ణజ్యోతి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్‌వోలకు మంగళవారం ఒక్కరోజు శిక్షణ, రాత పరీక్షను నిర్వహించారు. దెందులూరు నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు కృష్ణస్వామి ఎన్నికల విధులు, నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ రాట్నాలబాబు బీఎల్‌వోలకు శిక్షణలో నేర్చుకున్న అంశాలపై రాత పరీక్షను నిర్వహించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో ఆర్జేడీ సుజాతరాణి తనిఖీ

ఉంగుటూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు సెక్టార్‌లో అంగన్వాడీ కేంద్రాలను ఏలూరు జోన్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి.సుజాతరాణి మంగళవారం తనిఖీ చేశారు. పిల్లల పట్ల అంగన్వాడీ కేంద్రాల్లో తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. సుజాత రాణి వెంట ప్రాంతీయ కార్యాలయం నోడల్ అధికారిణి స్వరాజ్యలక్ష్మి భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి రాజశేఖర్, ఉంగుటూరు సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అంగన్వాడీ వర్కర్లు ఉన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కన సర్వీసు రోడ్డు వేయాలి

టి.నర్సాపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కన సర్వీసు రోడ్డు వేసి, రైతులు పొలాల్లోకి వెళ్లేలా గ్రామీణ రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. టి.నర్సాపురం మండలం మక్కినవారిగూడెం రోడ్డులోని గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద మంగళవారం సమావేశం నిర్వహించి రైతులు పొలాల్లోకి వెళ్లడానికి సర్వీసు రోడ్డు వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి, మాజీ జడ్పీటీసీ నల్లూరి వెంకట చలపతిరావు, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు అడపా నాగరాజు, టీడీపీ మాజీ మండలాధ్యక్షులు పెద్దిన సత్యనారాయణ, పి.మధు, లింగారెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేసుల రాజీలో మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించాలి

ఏలూరు క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రతి న్యాయవాది తమ కక్షిదారులకు మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే కలిగే ప్రయోజనాలను తెలియజేయాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులతో మంగళవారం సాయంత్రం అవగాహన సదస్సును నిర్వహించారు.

ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక వాడ

(3వ పేజీ తరువాయి)

సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనతో జిల్లాలో స్థూల ఉత్పత్తిని రెట్టింపు చేసేలా వివిధ శాఖలు అధికారులు సమన్వయం తో పనిచేయాలి. జిల్లాలో స్థూల ఉత్పత్తి రూ.72,314 కోట్లు కాగా, అందులో 60 శాతం వ్యవసాయం, 35 శాతం ఆక్వా, 19 శాతం ఉద్యానవనాల నుంచి వస్తోందని మంత్రి వివరించారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో చర్చించి గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని యంత్రాంగాన్ని మంత్రి నాదెండ్ల ఆదేశించారు.

100 ఫుడ్ ప్రాసెస్ యూనిట్లు : జిల్లాలో 100 ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటివరకు 27 యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. నూజివీడులో భారీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. మిగిలినవి నిర్దేశిత సమయంలో ఏర్పాటు చేస్తామని మంత్రికి వివరించారు. జిల్లాలో శాంతిభద్రతల సమస్య లేదని, పరిశ్రమల స్థాపనకు అనుకూలమని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు.

పర్యాటక ప్రాంతంగా కొల్లేరు : ఎంపీ

దేశంలో 50 ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి కేంద్రం సిద్ధంగా ఉందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ తెలిపారు. జిల్లాలో కొల్లేరు ప్రాంతాన్ని పెద్ద పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదన ఉందన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, మద్దిపాటి వెంకటరాజు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడారు. సమావేశంలో జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో వి విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు స్మరణ్‌రాజ్, రమణ, అంబరీష్, విజయవాడ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

మా గోడు పట్టించుకోండి

(3వ పేజీ తరువాయి)

గత ఆరు సంవత్స రాలుగా ఒక్కో కార్మికుడు రూ.4,50,000 నష్టపోయారు. కనీసం పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చిన రూ.21వేలు కూడా ఇవ్వడంలేదని ఇంజనీరింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు డ్యూటీ సమయాలు ఉండవని ఎక్కడ ఎలాంటి అంతరాయం కలిగిన వెళ్లి ఆ సమస్యను పరిష్కరిస్తామని అయినా ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని కార్మికులు మనోవేదన చెందుతున్నారు.

జిల్లాలో మునిసిపల్ కార్మికులు : ఏలూరు నగర పాలక సంస్థలో పర్మినెంట్ ఉద్యోగులు 60మంది, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు 250 మంది, నూజివీడులో 80 మంది, చింతలపూడిలో 20మంది, జంగారెడ్డిగూడెంలో 30మంది ఉన్నారు.



జీతాలు పెంచాలి: అరకొర జీతాలతో కుటుంబాలను పోషించుకోలేకపోతున్నాం. ప్రస్తుత రోజుల్లో నెలకు రూ.15వేలు జీతంతో కుటుంబంలో నలుగురు ఎలా బతకాలి. ప్రభుత్వం జీవోల ప్రకారం జీతాలు పెంచి ఎరియర్స్‌తో సహా చెల్లించాలి.

ఎ.అప్పలరాజు, మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి



దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి : రాత్రింబవళ్లు కష్టపడుతున్నాం. దీర్ఘకాలిక డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలి. స్కిల్డ్, అన్‌స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు సవరించాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చండి.

బి.నారాయణరావు, అసోసియేషన్ ట్రెజరర్

చంద్రబాబుతోనే సుపరిపాలన


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతమనేని

పెదపాడు, జూలై 15(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పెదపాడు మండలంలో పునుకొల్లు, తోటగూడెం, వసంతవాడ, గోగుంట గ్రామాల్లో ఎమ్మెల్యే చింతమనేని పాదయాత్ర ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేసి, స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తల్లికి వందనం నగదు జమపై తల్లులను ఆరా తీశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

● కామవరపుకోట: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ మండలాధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బ్రోచర్లను ఇంటింటికీ అందజేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. టీడీపీ నాయకులు ఘంటా సుధీర్‌బాబు, నెక్కలపు సూర్యనారాయణ, మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, నెక్కలపు గంగాధరరావు, కె.వి.సుబ్బారావు, కె.జయకృష్ణ ఉన్నారు.

● ఏలూరుటూటౌన్: ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చంటి 6వ డివిజన్‌లో పర్యటించారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను ఇప్పటికే 70 శాతం అమలు చేశామన్నారు.సూపర్ 6పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. త్వరలోనే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, పూజారి నిరంజన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

లింగపాలెం, జూలై 14(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి కె.రామారావు కోరారు. సింగగూడెంలో ప్రధానోపాధ్యాయుడు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ఆధ్వర్యంలో సింగగూడెంలో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంఈవో రామారావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు.ఉపాధ్యాయులు ఎన్.అంజలీ, ఎ.అప్పారావు, ఎం.విజయరేఖ, అంగన్‌వాడీ కార్యకర్త సునీత, రాజేశ్, కనకరాజు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటా

లింగపాలెం, జూలై 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ అన్నారు. ఇటీవల చెట్టుపై నుంచి కిందపడి తీవ్రగాయాలపాలై ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లింగపాలెం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సి.హెచ్.నరశింహను ఎంపీ పరామర్శించారు. అతనికి వైద్యఖర్చుల నిమిత్తం రూ.పది వేలు అందించారు. ఎంపీతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు మోటార్ల ఏర్పాటు

ఏలూరుటూటౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలను సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులోకి పంపడానికి 150 హెచ్‌పీ మోటార్లను అమర్చినట్టు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు తెలిపారు. వేసవిలో మోటార్లు సరిగా లేక గోదావరి జలాలు తోడటానికి ఇబ్బందిపడ్డామన్నారు. భవిష్యత్‌లో అలాంటి ఇబ్బందులు రాకూడదని 150 మోటార్‌ను బిగించినట్లు తెలిపారు. ఎంత సురేంద్రబాబు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్‌పై వర్క్‌షాపు

దెందులూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ క్రీడల్లో మెలకువలు తెలుసుకుంటూ రాణించాలని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేల్ అన్నారు. మంగళవారం మండలంలోని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో హ్యాండ్ బాల్ క్రీడకు సంబంధించి వర్క్‌షాపును కళాశాల గ్రౌండ్‌లో రిసోర్స్ పర్సన్‌లు డాక్టర్ బి.కృష్ణదీపిక, వలపుల సౌజన్యలు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

బీసీ సంక్షేమంపై ఎమ్మెల్యే సమీక్ష

ఉంగుటూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన సామాజిక వర్గాల విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన భీమడోలు బీసీ కళాశాల, బాలుర వసతి గృహాల సలహా సంఘ సభ్యులతో ఎమ్మెల్యే సమీక్షించారు. వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాల కల్పనతో పాటు పలు అంశాలపై చర్చించారు. సంక్షేమ అధికారి టి.వెంకటేశ్వర్లు, ఎ.ధనలక్ష్మి, టి.సాయిలీల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవిచంద్ర

ఆటో డ్రైవర్లకు అవగాహన

జంగారెడ్డిగూడెం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. మంగళవారం సీఐ కార్యాలయంలో మండలంలోని ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ రవిచంద్ర మాట్లాడుతూ ఆటో నడిపే ప్రతీ డ్రైవరుకు తప్పనిసరిగా లైసెన్సు ఉండాలన్నారు. జాతీయ రహదారిపై ఆటోలు నడిపే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సిఐ ఎం.వి. సుభాష్, ఎస్.ఐ. ఎస్.కె.జబీర్, ట్రాఫిక్ ఎస్.ఐ. కుటుంబరావు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కామవరపుకోట, జూలై 15(ఆంధ్రజ్యోతి): తడికలపూడి ఎస్ఐ చెన్నారావు ఆధ్వర్యంలో పోలీసులు కామవరపుకోట, కొత్తూరు, తడికలపూడి తదితర ప్రాంతాల్లో మంగళవారం రాకపోకలు సాగిస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. వారి రికార్డులను పరిశీలించారు. హెల్మెట్‌లు, వాహన రికార్డులు లేనివారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు.

సంపద సృష్టి కేంద్రాల పరిశీలన

లింగపాలెం, జూలై 14(ఆంధ్రజ్యోతి): సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని, దానికి సంబంధించిన సమస్యలు అధికారులు పరిష్కరించాలని జిల్లా కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీహరి అన్నారు. మఠంగూడెంలోని చెత్త నుంచి సంపద కేంద్రాలను, శానిటేషన్ పనులను పరిశీలించారు. గ్రామంలో చెత్త సేకరణ, తడి, పొడి చెత్త సేకరణ గురించి అడిగి తెలుసుకున్నారు. కొన్ని గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాల నిర్వహణలో లోపాలు ఉన్నాయని, చెత్తను సేకరించే పరికరాలు సరిగాలేవని, సిబ్బంది కొరత ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రామాలన్నీ శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కె.వాణి, డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి, పంచాయతీ కార్యదర్శులు ఆర్.పాపయ్య, ఎం.సుగుణరాజు, సి.హెచ్. రాజు, బి.బాలకృష్ణ పాల్గొన్నారు.

కోట, సరోజా దేవి మృతికి నివాళి

ఏలూరు రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లా రచయితల సంఘం సమావేశం మంగళవారం అమీనాపేటలో జరిగింది. ఈసందర్భంగా ప్రముఖ సినీ కళాకారులు కోటా శ్రీనివాసరావుకు, బి.సరోజాదేవిల మృతికి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నటనలో కోటా శ్రీనివాసరావు, సరోజాదేవి ప్రతిభను కొనియాడారు. నంది అవార్డు గ్రహీత మహ్మద్ ఖాజావలీ మాట్లాడుతూ ఎటువంటి పాత్ర ఇచ్చినా ఆ పాత్రలో ఒదిగిపోయే గుణం కోటాకు ఉందన్నారు. లేళ్ళ వెంకటేశ్వరరావు, కార్యదర్శి నాగాస్త్ర పాల్గొన్నారు.

పోతునూరు బ్యాంక్ అధ్యక్షుడిగా మోహన్

దెందులూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): పోతునూరు భోగేశ్వరస్వామి విశాల పరపతి సంఘం బ్యాంక్ అధ్యక్షుడిగా కేథవరం గ్రామానికి చెందిన బోడేటి మోహన్‌బాబు కార్యదర్శి విజయ్, టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి మిల్లు బాబు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. మంగళవారం బ్యాంక్ డైరెక్టర్లుగా గుడపాటి విజయ్ కుమార్, చల్ల బాలస్వామి బాధ్యతలు తీసుకున్నారు. తెలుగు యువత అధ్యక్షులు మోతుకూరి నాని, గ్రామాధ్యక్షుడు నున్న లక్ష్మణ్, ఏపీ కాపు కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ లావేటి శ్రీను, టీడీపీ జిల్లా కార్యదర్శి పంది ఆంజనేయులు, చలసాని రాంబాబు, బాయి రాంప్రసాద్, బిళ్ల వీర్రాజు, నాగు, సాంబశివరావులు మోహన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు నిధులు

కామవరపుకోట, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలోని కామవరపుకోట మండలం ఆడమిల్లి సచివాలయం సమీపంలోని పాత వంతెన కుంగిన సంగతి తెలిసిందే.. టీడీపీ మండ లాధ్యక్షుడు ఏలూరి శివరామకృష్ణ విషయాన్ని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ప్రత్యామ్నాయ రోడ్డుకు నిధులు మంజూరుచేసినట్టు రామకృష్ణ తెలిపారు.

పారిశుధ్య పనులు పర్యవేక్షించాలి

ఏలూరు రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా నిరతరం పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని ఏలూరు ఎంపీడీవో వెన్నా శ్రీలత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మాదేపల్లిలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. వ్యర్థాలు రోడ్డుపైన వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

దివ్యాంగులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

ఏలూరు రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): దొండపాడు ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల జిల్లా పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో, ఏలూరులోని ప్రభుత్వం ఐటీఐ కళాశాలలో మంగళవారం ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం నిర్వహించారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ డి.భూషణం, ట్రైనింగ్ అధికారి కె.రామచంద్రరావు పాల్గొని మాట్లాడుతూ దివ్యాంగ యువత నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం సమృద్ధిని సాధించాలన్నారు. దివ్యాంగుల జిల్లా పునరావాస కేంద్రం కోఆర్డినేటర్ డి.శ్రీనివాస్‌రెడ్డి దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

ఘనంగా కేఎల్ రావు జయంతి

ఏలూరు రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఏలూరు ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్‌లో పద్మభూషణ్ డాక్టర్ కానూరి లక్ష్మణరావు(కె.ఎల్.రావు) జయంతిని ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కె.ఎల్.రావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏలూరు ఎస్ఈ పమ్మి నాగార్జునరావు, ఎస్ఈ వెంకటస్వామి, దేవ ప్రకాశ్, రిటైర్డ్ ఇంజనీర్స్ రేవు సతీశ్ కుమార్ పాల్గొన్నారు.

శస్త్రచికిత్స చేయించుకున్న వృద్ధురాలి మృతి

జంగారెడ్డిగూడెం, జూలై 15(ఆంధ్రజ్యోతి): కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్న కవులూరి రామలక్ష్మి(60)అనే వృద్ధురాలు జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో మంగళవారం గుండె పోటుతో మృతి చెందింది. ఏరియా ఆస్పత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ సిహెచ్.బేబీ కమల మాట్లాడుతూ పట్టణానికి చెందిన మృతురాలు కవులూరి రామలక్ష్మి సుగర్, గుండె సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చేరినట్లు తెలిపారు. సుగర్ కారణంగా ఆమె ఎడమ కాలు సెప్టిక్ అవడంతో శస్త్రచికిత్స చేసి పాడైన కాలి భాగం తొలగించినట్లు తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతమైందని, అయితే మంగళవారం వృద్ధురాలికి గుండె పోటు రావడంతో మృతి చెందినట్టు ఆమె తెలిపారు. శస్త్రచికిత్స రిస్క్ అని ముందుగానే తెలియజేసి వారి అనుమతితోనే చేసినట్టు తెలిపారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి : సీపీఐ

ఏలూరుకార్పొరేషన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తగదని పలువురు ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో ఖండించారు. మంగళవారం సీపీఐ కార్యాలయం వద్ద ఏలూరు జిల్లా కార్యదర్శి మండవ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ప్రజాప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు భారంగా మారుతుందని, ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం


రెడ్‌క్రాస్‌ను పరిశీలిస్తున్న ఎంపీ మహేశ్, ఎమ్మెల్యే చంటి

ఏలూరు క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న తలసేమియా కేంద్రంలోని సేవలు బాగున్నాయని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రత్యేక తలసేమియా చికిత్స కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకు, తలసేమియా చికిత్సా కేంద్రాన్ని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, ఏలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బడేటి చంటి సందర్శించారు. ఎంపీ మాట్లాడుతూ సేవా భావం గల డాక్టర్లు రెడ్‌క్రాస్ సొసైటీకి చైర్మన్లుగా వ్యవహరించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) మాట్లాడుతూ రాజకీయాలకు తావు లేకుండా ఎంబీఎస్‌వీ ప్రసాద్, సేవా భావం గల వ్యక్తులతో మంచి కమిటీ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ ఎంబీఎస్‌వీ ప్రసాద్, వైస్ చైర్మన్ జె సత్యనారాయణరాజు, ఏలూరు ప్రభుత్వాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ శశిధర్‌బాబు, రెడ్‌క్రాస్ కార్యదర్శి బెన్నీ, కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్, పి.శ్రీరామరాజు, ఎం.అజయ్‌బాబు, బి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, జూలై 15(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి ఒక బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. వ్యర్థాలతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహన యజమాని, డ్రైవర్‌పై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ. సతీశ్ తెలిపారు.

సెల్‌ఫోన్ మరమ్మతులపై శిక్షణ

పెదపాడు, జూలై 15(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ మరమ్మతులపై 30 రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఈ నెల 21 నుంచి ప్రారంభమవుతుందని సంస్థ తెలిపింది. 10వ తరగతి ఆపై విద్యార్హత గల ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. శిక్షణలో వసతి, భోజనం ఉచితంగా అందజేస్తామన్నారు. వివరాలకు వట్లూరు (సత్రంపాడు) టీటీడీసీ పక్కన కార్యాలయాన్ని(99485 65256, 90140 40780, 95330 79471) సంప్రదించాలన్నారు.

పేకాడుతున్న పదిమంది అరెస్ట్

పెదపాడు, జూలై 15(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పెదపాడు మండలం అప్పనవీడు పరిసరాల్లో సిబ్బందితో కలిసి దాడి చేసి పది మందిని అరెస్ట్ చేసినట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారద సతీశ్ తెలిపారు. వీరి నుంచి రూ.11,230 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట ఆడుతుంటే(94407 96637) సమాచారం అందించాలని ఎస్.ఐ. సతీశ్ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ రోడ్డులో చెట్టు కొమ్మల తొలగింపు నిమిత్తం బుధవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ తెలిపారు. బైపాస్ రోడ్డు, ఉప్పటమెట్ట, ఏరియా ఆసుపత్రి, సుబ్బంపేట, ముత్యాలమ్మ నగర్, రాజీవ్ నగర్, గరుడ పక్షి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. అలాగే మండలంలోని నిమ్మలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో 24 గంటల లైన్ వేయడానికి కట్టవపోదలవారిగూడెం గ్రామానికి వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

బుట్టాయగూడెం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పోటీ తత్వాన్ని అలవర్చుకుని ముందుకు సాగాలని ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలోని గ్రంథాలయ నిర్వాహకులు జీవీఎల్ నరసింహారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీయూవీఎన్ మునేంద్రరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో కొవ్వాసు ముక్కయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని భార్య కె.వెంకటలక్ష్మి, కుమారుడు చంద్రశేఖర్ ప్రారంభించారు. కొవ్వాసు సూర్య ప్రకాశ్ అమెరికాలో ఫార్మా రంగంలో ఉద్యోగం చేస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కుంజా వెంకటేశ్వరరావు, తెల్లం రామకృష్ణ, కె.మేరీకుమారి, పోలోజు నాగేశ్వరరావు, తెల్లం వెంకాయమ్మ, జోడే సత్యదుర్గా ప్రసాద్, సరియం చల్లయ్యదొర, ఎం.నాగమణి, జి.ఫిలిప్, పి.శేఖర్‌బాబు, యు.వెంకటేశ్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

ఏలూరు అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా వ్యతిరేకదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఏలూరు రైల్వే స్టేషన్‌లో చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) ఆధ్వర్యంలో ప్రయాణికులకు అవగాహన సదస్సు నిర్వహించినట్టు క్రాఫ్ కో-ఆర్డినేటర్ వినోద్ కుమార్ తెలిపారు. రైల్వే పోలీసు, లీగల్ సర్వీసెస్ అథారిటీ, చైల్డ్‌లైన్, తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా బెల్లపు ఊట ధ్వంసం

జీలుగుమిల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్, అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలో జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో దాడులు జరిపారు. పి.అంకంపాలెం శివారు పొలాల మధ్య జరిపిన ఈ దాడుల్లో 200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఎస్.ఐ. సుబ్రహ్మణ్యం, కానిస్టేబుళ్లు ఉన్నారు.


శ్రీవారి దర్శనానికి వెళ్లిన వారితో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

తిరుమల శ్రీవారి సేవలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

జీలుగుమిల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వేంకటేశ్వరస్వామిని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మంగళవారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. నియోజకవర్గంలో ప్రజలంతా సుభిక్షంగా, శాంతి సౌభాగ్యాలతో ఉండాలని స్వామిని దర్శించుకున్నట్టు తెలిపారు. ఆయన వెంట జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గడ్డమణుగు రవికుమార్, కరాటం సాయి, కుమార్ నాయుడు కుటుంబ సభ్యులు ఉన్నారు.

కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు

ఏలూరు క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): వివాహ సమయంలో ఇచ్చిన కట్నం చాలలేదంటూ అదనపు కట్నం తీసుకురావాలంటూ భార్యను వేధిస్తున్న భర్తపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. తంగెళ్ళమూడి అరుంధతి కాలనీకి చెందిన వినుకొండ ఉషారాణికి 2003లో బాలరాజుతో వివాహమైంది. బాలరాజు టోల్‌గేటులో పనిచేస్తున్నాడు. అదనపు కట్నం మరో పది లక్షలు తీసుకురావాలని వేధించడంతో బాధితురాలు ఏలూరు టూటౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుంతరోడ్డు తవ్వకాన్ని అడ్డుకున్న రైతులు

ద్వారకాతిరుమల, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఓ రైతు పుంతరోడ్డు తనదేనంటూ తవ్వేయడం స్థానికంగా వివాదాస్పదమైంది. ఈ తవ్వకాన్ని స్థానిక రైతులు, అధికారులు అడ్డుకున్నారు. ద్వారకాతిరుమల నుంచి మలసానికుంటకు వెళ్లే రహదారిలో కొమ్ముగూడెం రెవెన్యూ పరిధిలో కొంత భూమిని ముగ్గురు రైతులు కొనుగోలు చేసి మంగళవారం తమ భూమి పక్కనే ఉన్న పుంతరోడ్డు కూడా తమదేనంటూ తవ్వడంతో రైతులు అడ్డుకున్నారు. సమాచారాన్ని అందుకున్న వీఆర్వో మహాలక్ష్మి, సిబ్బంది అక్కడకు చేరుకుని సర్వే నిర్వహిస్తామని అప్పటి వరకూ తవ్వకాలు ఆపాలని ఆదేశించడంతో పనులు నిలిచిపోయాయి.

సీఆర్ఆర్ విద్యార్థినికి రూ.46.3 లక్షల వార్షిక వేతనం


నిఖిత

పెదపాడు, జూలై 15(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన (పూర్వ) విద్యార్థిని పెనుమచ్చ నిఖిత అమెజాన్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీరుగా రూ.46.3 లక్షల వార్షిక వేతనంతో ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు తెలిపారు. నిఖిత 2025 మార్చిలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ డేటా సైన్సులో బీటెక్ పూర్తి చేసింది. అత్యధిక వార్షిక వేతనంతో అమెజాన్‌లో ఉద్యోగానికి ఎంపికైన నిఖితను కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, ఇంచార్జి కరస్పాండెంట్ కొండా హరి రామకృష్ణంరాజు, సీఎస్ఈ హెచ్‌వోడీ డాక్టరు యేసుబాబు అభినందించారు.

ఇంధన వనరులపై అవగాహన సదస్సు

ఆగిరిపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పోతవరప్పాడులోని ఎన్ఆర్ఐ కాలేజీలో మంగళవారం కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్. వెంకట్రావు అధ్యక్షతన ఏపీ ట్రాన్స్‌కో పవర్ రీసెర్స్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ ఇంజనీర్ టి. శైలజ ఆధ్వర్యంలో పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాముఖ్యత, సాంప్రదాయేతర ఇంధన నిర్వహణ, ఇంధన సామర్థ్యంపై ఏపీ ట్రాన్స్‌కో ఇంజనీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. నాగభాస్కర్, డాక్టర్ ఎన్. సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మునునూరు తహసీల్దార్‌గా ప్రశాంతి

ముసునూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండల నూతన తహసీల్దార్‌గా దాసరి ప్రశాంతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజ్‌కుమార్ రెండు నెలల క్రితం ఉయ్యూరు సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోగా బదిలీపై వెళ్లారు. డిప్యూటీ తహసీల్దార్ కేవీ రమణ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. అయితే చాట్రాయి మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ సస్పెండైన ప్రశాంతిని నాలుగు నెలల్లోనే ముసునూరు తహసీల్దార్‌గా ఉన్నతాధికారులు నియమించడం విశేషం.



కైకలూరులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

కైకలూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగుమందుల అమ్మకాల్లో రైతులకు బిల్లులు తప్పనిసరిగా అందించాలని రాజమండ్రి విజిలెన్స్ డీఎస్పీ ఎస్. తాతారావు అన్నారు. మంగళవారం కైకలూరు పట్టణంలోని ఎరువుల, పురుగుమందుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కైకలూరులోని మందుల దుకాణంలో రూ.8.62 లక్షల విలువ చేసే పురుగు మందుల నిల్వలను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా దుకాణాదారులకు పలు సూచనలు చేశారు. పురుగు మందులు ప్రత్యేకంగా సెల్ ఏర్పాటుచేసి విక్రయాలు జరగాలని అలాగే నిల్వలను ప్రత్యేక గౌడోన్లో భద్రపరచాలని, ప్రతి రైతుకు పురుగు మందులు అమ్మిన వెంటనే విధిగా బిల్లులు ఇవ్వాలని అలాగే పురుగుమందులు, ఎరువుల ధరలను డిస్‌ప్లే చేయాలని లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆక్వా మందులతో కలిపి గోడౌన్లో నిల్వలుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో అనపర్తి వ్యవసాయ శాఖ ఏడీ జీవీ కృష్ణ, ఏలూరు ఏడీ ఈదా అనిల్‌కుమారి, మండవల్లి ఏడీఏ జి. వెంకటమణి, కైకలూరు మండల వ్యవసాయాధికారిణి ఆర్. దివ్య తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు-ఎయిమ్స్‌కు బస్సు సదుపాయం

నూజివీడు టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఆర్టీసీ బస్సు డిపో నుంచి మంగళగిరిలోని ప్రఖ్యాత ఆల్ ఇండియా మెడికల్ సైన్స్ (ఎయిమ్స్) హాస్పిటల్‌కు బస్సు సౌకర్యం కల్పించినట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (జోన్) విజయరత్నం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతుల వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అతి తక్కువ ఫీజుతో ప్రభుత్వం నిర్వహించే పెద్ద హాస్పిటల్‌లో ఏ టెస్ట్ అయినా అతి తక్కువ ధరకే అందుబాటులో తెచ్చిన ఎయిమ్స్ హాస్పిటల్‌కి నూజివీడు డిపో నుంచి విసన్నపేట వెళ్ళి అక్కడ ఉదయం 6:00 గంటలకు బయలుదేరి నూజివీడు వచ్చి, రామన్నగూడెం, పట్టిగుడిపాడు, ఈదుల గూడెం మీదుగా ఆగిరిపల్లి, అడవి నెక్కలం, నున్న, విజయవాడ, వారధి మీదుగా ఎయిమ్స్ హాస్పిటల్‌కు 8:50 నిమిషాలకు ఓపీ టైమ్‌కి వెళ్తుందన్నారు. మరలా సాయంత్రం 4:30 గంటలకు ఎయిమ్స్ హాస్పిటల్ వద్ద బయలుదేరి పైన చెప్పిన రూట్‌లో నూజివీడు, విస్సన్నపేట వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఏలూరు డిస్ట్రిక్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ షబ్నం, నూజివీడు ఇన్‌చార్జి డిపో మేనేజర్ జి. రాంబాబు కోరుతున్నారు.

ఎన్‌వోసీ అందజేసిన మంత్రి పార్థసారథి

చాట్రాయి, జూలై 15(ఆంధ్ర జ్యోతి): మండలంలోని జనార్దనవరం గ్రామానికి చెం దిన చల్లపల్లి నాగరాజుకు గొంతు సంబంధ శస్త్ర చికిత్స కోసం రూ. 50 వేలు ఎన్‌వోసీని మంగళవారం గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థ సారథి అందజేశారు. టీడీపీ నాయకులు పలగాని దుర్గారావు, కలకొండ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సాయి ప్రియకు ఉత్తమ హిప్నోథెరపిస్ట్ అవార్డు



ఆగిరిపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సాయి ప్రియ ఉత్తమ హిప్నోథెరపిస్ట్ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన హిప్నోసిస్ అవార్డ్స్-2025 కార్యక్రమంలో మానసిక ఆరోగ్య సేవా రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా అవార్డు లభించింది. మారుమూల గ్రామంలో పుట్టి గ్రామానికి రాష్ట్రస్థాయి గుర్తింపు తీసుకురావడం పట్ల గ్రామస్థులు ఆమెను సన్మానించారు. తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరు రామచంద్రరావు, మైండ్ సపోర్ట్ ఫౌండర్ శశికిరణ్, డాక్టర్ ప్రసన్న హరికృష్ణ, దేవాన్షి పాల్గొన్నారు.



పెదగరువులో పాఠశాల విద్యార్థుల ర్యాలీ

కోలాహలంగా 'నేను బడికిపోతా'

ముదినేపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలో మంగళవారం నేను బడికి పోతా కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించారు. ఫౌండేషన్ పాఠశాలల హెచ్ఎంలు కూడా ర్యాలీలను నిర్వహించి ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించారు. ఎంఈవో-1 రామారావు, ఎంఈవో-2 నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ర్యాలీలు నిర్వహించారు.



ఆషాఢ సారె సమర్పణ

కైకలూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): కైకలూరు చిన్నచెరువుగట్టుపై ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి, ఆలయంలో కొలువైన సీతాదేవికి వందలాది మంది మహిళలు ఆషాఢ సారెను అందజేశారు. మంగళవారం కైకలూరు పట్టణంలోని సుమారు 300మంది మహిళలు పిండి వంటలు, స్వీట్లు, పండ్లు సారె ఊరేగింపుగా తీసుకువచ్చి అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించి మహిళలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనలో 2వేల మంది భక్తులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

ఎప్పటికి పూర్తయ్యేనో..?



సిమెంట్ ప్లేట్లు అమర్చని పక్కా డ్రైన్

ముదినేపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ముదినేపల్లి సెంటర్‌లో చేపట్టిన పక్కా డ్రైన్ల నిర్మాణం సాఫీగా జరగకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ముదినేపల్లిలోని పోలీస్ స్టేషన్- ఎస్‌బీఐ సెంటర్‌లో డ్రైన్ల నిర్మాణం ఏళ్ల తరబడి పూర్తి కాకపోవటంతో ప్రమాదకరంగా ఉంది. ఎస్‌బీఐ నుంచి డ్రైన్ నిర్మాణం నేటికీ పూర్తి కాలేదు. బ్యాంక్ ఎదుట డ్రైన్ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందాన ఉంది. బ్యాంకుకు

ఆగిన డ్రెయిన్ నిర్మాణం

వెళ్లే ఖాతాదారులు అసంపూర్తిగా డ్రైన్ నిర్మాణంతో అవస్థలు పడుతున్నారు. ఆ ప్రాంతంలో నడిచేందుకు కూడా అవకాశం లేకుండా ఉంది. బ్యాంక్ నుంచి బయటికి వచ్చేటప్పుడు ఆదమరిస్తే డ్రెయిన్‌లో పడిపోవటమే. పలు చోట్ల నిర్మించిన డ్రెయిన్లపై సిమెంట్ ప్లేట్లు అమర్చకపోవటంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు డ్రెయిన్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మంచి భవితకు బాటలు వేసుకోవాలి

ఆర్జీయూకేటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్

పీయూసీ మొదటి సంవత్సర విద్యార్థులకు ఓరియెంటేషన్ ప్రోగ్రామ్



మాట్లాడుతున్న నూజివీడు డైరెక్టర్ ఆచార్య అమరేంద్రకుమార్

నూజివీడు టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఆర్జీయూకేటీలో పీయూసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు మంగళవారం ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ మాట్లాడుతూ నూతనంగా పీయూసీలో చేరిన విద్యార్థులు క్యాంపస్ పద్ధతులను తెలుసుకొని, వాటికి అలవాటుపడి మసులుకోవాలని, బాధ్యతతో వ్యవహరిస్తూ మంచి భవిష్యత్‌కు దారులు వేసుకోవాలన్నారు. ఈ నెల 21 నుంచి క్రమంగా అకడమిక్ షెడ్యూల్ ప్రకారం తరగతులు జరుగుతాయని, 28 నుంచి స్టడీ అవర్స్ ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు స్నేహభావంతో మెలగాలన్నారు. క్యాంపస్‌లో అమ్మాయిల పట్ల అనుచితంగా ప్రవర్తించినా, ఇతర విద్యార్థుల్ని ర్యాగింగ్ చేసినట్లు తమ దృష్టికి వచ్చినా విద్యార్థులకు క్యాంపస్‌లో అదే ఆఖరి రోజు అవుతుందని హెచ్చరించారు. డీన్ అకడమిక్స్ డాక్టర్ చిరంజీవి మాట్లాడుతూ మొదటి రెండు సంవత్సరాలు పీయూసీ, ఆ తరువాత నాలుగు సంవత్సరాలు బీటెక్ కోర్సు చదవాల్సి ఉంటుందని, పీయూసీలో సంవత్సరాంతానికి, ఇంజనీరింగ్‌లో సెమిస్టర్ విధానంలో పరీక్షలు జరుగుతాయని, పీయూసీ విద్యార్థులకు ఆరు మాసాంత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అందులో నాలుగు మాసాంతర పరీక్షల్లో వచ్చిన మార్కులను పరిగణలోకి తీసుకుంటామని, ఆర్జీయూకేటీ ప్రవేశాలలో పాటించిన రిజర్వేషన్ విధానమే ఇంజనీరింగ్‌లో కేటాయించే బ్రాంచ్‌లకు కూడా వర్తిస్తుందని, విద్యార్థులు కష్టపడి చదివి రెమెడియల్ లేకుండా చూసుకోవాలన్నారు. పరిపాలన అధికారి డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యాసంస్థ ఆస్తులను పాడు చేసిన వాళ్ళకు ఫైన్ విధిస్తామన్నారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఫర్ బాయ్స్ డా.రాజేష్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఫర్ గరల్స్ డా.దుర్గాభవాని, చీఫ్ వార్డెన్ బి. సురేష్‌బాబు పాల్గొని హాస్టల్స్ విషయంలో విద్యార్థులు జాగ్రత్తగా ఎలా ప్రవర్తించాలో తెలియజేశారు. అసోసియేట్ డీన్స్ భరత్, రఘు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.





అక్కిరెడ్డిగూడెం, పోతనపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కూటమితోనే సంక్షేమం, అభివృద్ధి

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులు

ముసునూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనతోనే ప్రజా సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ గ్రామ అధ్యక్షులు బర్మా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మానురాజు సురేష్ అన్నారు. మంగళవారం అక్కిరెడ్డిగూడెంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు -ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిపై ప్రజలకు వివరిస్తూ నాయకులు కరపత్రాలను అందజేశారు. గత ప్రభుత్వ విధ్వంస పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోనే సుపరిపాలనను అందించి, ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందిస్తూ, అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా నష్టం కలిగించిందని, ఈ ప్రభుత్వం రైతులకు సబ్సిడీ పథకాలు, బిందు సేద్యం పరికరాలు, నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులను అందించడంతోపాటు త్వరలో పెట్టుబడి సాయం కింద అన్నదాతా సుఖీభవ ద్వారా ప్రతి రైతుకు రూ. 20 వేలు ఇవ్వనుందన్నారు. నాయకులు నందిపాము అచ్చియ్య, ఉలాస శ్రీనివాసరావు, పులిబక్క రాజా తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కోరుకొల్లులో టీడీపీ నాయకులు సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వలవల రామారావు, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం, గ్రామ టీడీపీ అధ్యక్షుడు చెన్నంశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ ప్రధాన కార్యదర్శి నల్లిబోయిన భోగేశ్వరరావు, నాయకులు వలవల రాజా, రాజేష్, బిరుదుగడ్డ కిరణ్, యర్రంశెట్టి విజయసారధి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని పోతనపల్లిలో మంగళవారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంచి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు ధరావతు భాస్కరరావు, స్థానిక నాయకులు ధరావతు మల్లికార్జునరావు, మంగయ్య, సుధాకర్, ఏసుబాబు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం

మంత్రి నారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం నెరవేరుస్తోందని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం విధ్వంస పాలనా విధానాలతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేసిందని, అనుభవజ్ఞుడైన సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. మంగళవారం పట్టణంలోని 19వ వార్డులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసీపీ పాలనా విధానాలతో రాష్ట్రం ఊబిలో కూరుకుపోయిందని, రూ. 10 లక్షల కోట్లు గత వైసీపీ ప్రభుత్వం అప్పులు చేసిందన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావల్సిన ఎన్నో ప్రాజెక్టులను వైసీపీ రాకుండా చేసిందని దుయ్యబట్టారు. తాను 2014లో మంత్రిగా ఉన్నప్పుడు 2019 ఫిబ్రవరిలో కేంద్రం నుంచి ఇంటింటికి కుళాయి కనెక్షన్ల కోసం రూ. 5,350 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించామని, వీటిలో 70 శాతం కేంద్రం భరించాల్సి ఉండగా మిగిలిన 30 శాతం రాష్ట్రం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అయితే అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు మంజూరైనా రాష్ట్రం నుంచి ఇవ్వాల్సినవి ఇవ్వకుండా వాటిని నిర్వీర్యం చేసిందన్నారు. అలాగే ఇంటింటికి తాగునీరు అందించేందుకు గాను అమృత్ స్కీంలో గత తమ ప్రభుత్వ హయాంలో రూ. 8500 కోట్లు మంజూరు చేయించినప్పటికి వైసీపీ విధానాల కారణంగా ఆ నిధులు కూడా వెనక్కి మళ్ళి పోయాయన్నారు. అలా వెళ్ళిపోయిన నిధులన్నింటికి తిరిగి రాబట్టేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆ నిధులు వస్తే తాడేపల్లిగూడెంలో పైపులైన్లు, రెండవ సమ్మర్ స్టోరేజ్ తదితర పనుల కోసం సుమారు 200 కోట్లు మంజూరు అవుతాయన్నారు. పట్టణంలోని 19వ వార్డులో పర్యటించిన మంత్రికి నారాయణకు స్థానిక మహిళలు హార తులు పట్టి ఘన స్వాగతం పలికారు. అలాగే తమ సమస్యలను మంత్రి కి చెప్పుకున్నారు. తమ వార్డులో ప్రధాన డ్రైనేజీ అసలు బాగోలేదని దీనివల్ల తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపో యారు. స్పందించిన మంత్రి అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ ఏసు బాబుతో మాట్లాడారు. ఆ డ్రైనేజీ నిర్మా ణం జరగాలంటే రూ. 85 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో వెంటనే మంజూరు చేయిస్తానంటూ మంత్రి హామీ ఇచ్చారు. అదే వార్డులో 3 సీసీ రహదారులకు గాను రూ. 2 కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో బాబ్జి మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రిని సత్కరించారు.

మా గోడు పట్టించుకోండి

(3వ పేజీ తరువాయి)

గత ఆరు సంవత్సరాలుగా ఒక్కో కార్మికుడు రూ.4,50,000 నష్టపోయారు. కనీసం పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన రూ.21వేలు కూడా ఇవ్వడం లేదని ఇంజనీరింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు డ్యూటీ సమయాలు ఉండవని ఎప్పుడూ ఎక్కడ ఎటువంటి అంతరాయం కలిగిన తక్షణమే వెళ్లి ఆ సమస్యను పరిష్కరిస్తామని అయినప్పటికి ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని కార్మికులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు.

జిల్లాలో మునిసిపల్ కార్మికులు

ఏలూరు నగర పాలక సంస్థలో పర్మినెంట్ ఉద్యోగులు 60మంది, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 250 మంది, నూజివీడులో 80 మంది, చింతలపూడిలో 20మంది, జంగారెడ్డిగూడెంలో 30మంది, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు.

జీతాలు పెంచాలి



అరకొర జీతాలతో కుటుంబాలను పోషించు కోలేక పోతున్నాం. ప్రస్తుత రోజుల్లో నెలకు రూ.15 వేలు జీతంతో కుటుంబంలో నలుగురు ఎలా బతకాలి. ప్రభుత్వం జీవోల ప్రకారం జీతాలు పెంచి ఎరియర్స్‌తో సహా చెల్లించాలి.

ఎ.అప్పలరాజు, మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి



రాత్రింబవళ్లు కష్టపడుతున్నాం. దీర్ఘకాలిక డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలి. స్కిల్డ్, అన్‌స్కిల్డ్, సెమి స్కిల్డ్ వేతనాలు సవరించాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.

-బి.నారాయణరావు, అసోసియేషన్ ట్రెజరర్

ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామికవాడ

(3వ పేజీ తరువాయి)

సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనతో జిల్లాలో స్థూల ఉత్పత్తిని రెట్టింపు చేసేలా వివిధ శాఖలు అధికారులు సమన్వయం తో పనిచేయాలి. జిల్లాలో స్థూల ఉత్పత్తి రూ.72,314 కోట్లు కాగా, అందులో 60 శాతం వ్యవసాయం, 35 శాతం ఆక్వా, 19 శాతం ఉద్యానవనాల నుంచి వస్తోందని మంత్రి వివరించారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో చర్చించి గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని యంత్రాంగాన్ని మంత్రి నాదెండ్ల ఆదేశించారు.

100 ఫుడ్ ప్రాసెస్ యూనిట్లు

జిల్లాలో 100 ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటివరకు 27 యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. నూజివీడులో భారీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. మిగిలినవి నిర్దేశిత సమయంలో ఏర్పాటు చేస్తామని మంత్రికి వివరించారు. జిల్లాలో శాంతిభద్రతల సమస్య లేదని, పరిశ్రమల స్థాపనకు అనుకూలమని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు.

పర్యాటక ప్రాంతంగా కొల్లేరు : ఎంపీ

దేశంలో 50 ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి కేంద్రం సిద్ధంగా ఉందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ తెలిపారు. జిల్లాలో కొల్లేరు ప్రాంతాన్ని పెద్ద పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపా దన ఉందన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, మద్దిపాటి వెంకటరాజు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడారు. సమావేశంలో జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో వి విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు స్మరణ్‌రాజ్, రమణ, అంబరీష్, విజయవాడ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి ఎం. శివకిరణ్, న్యాయవాదులు

మీడియేషన్‌పై అవగాహన ర్యాలీ

కైకలూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కేసులు రాజీ చేసుకోవాలని కైకలూరు జూనియర్ సివిల్ జడ్జి ఎం. శివకిరణ్ అన్నారు. మంగళవారం కైకలూరు సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానాల సముదాయంలో మధ్యవర్తిత్వం దేశం కోసం కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం నడిపేందుకు బార్ అసోసియేషన్‌లో ముగ్గురు న్యాయవాదులకు శిక్షణ ఇచ్చామని వారి ద్వారా ఇరువర్గాలు కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. ఇప్పటికే లోక్ అదాలత్ ద్వారా అనేక కేసులు రాజీ చేస్తున్నామని అయినప్పటికీ త్వరితగతిన కేసులు పరిష్కారం కాకపోవడం, సమయానికి తీర్పులు వెలవడకపోవడంతో దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ మార్గాన్ని ఎంపిక చేసిందని దీనిలో చెక్‌బౌన్స్ కేసులు, సివిల్, క్రిమిన ల్, ఇన్సూరెన్సు కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. శిక్షణ పొందిన న్యాయవాదులు మాడెం వీర వెంకట సత్యనారాయణ, డి శివప్రసాద్, కె కోటయ్య, న్యాయ వాదులు వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, పి. పవన్‌కాంత్, డి శ్యాంప్రసాద్, సీహెచ్. శంకరశాస్త్రి జితేంద్ర, కందుల రమాదేవి, వెంకటప్పయ్య, గంగాధరరావు కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవిపై సర్వత్రా హర్షం: మంత్రి

నూజివీడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఆ పార్టీ కష్టనష్టాలలో పాలుపంచుకున్న కేంద్ర మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులు కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం నూజివీడు క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పుట్టింది రాజవంశంలో అయినా ప్రజా సమస్యల పట్ల ఆయన చూపే చొరవ అందరికీ ఆదర్శం అన్నారు. మానస ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ విశేష ప్రజాదరణ పొందారన్నారు. గజపతిరాజుకు మంత్రి సారథి అభినందనలు తెలిపారు.

త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా చలసాని

ముదినేపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): 1982 నుంచి టీడీపీలో సామాన్య కార్యకర్తగా అంకిత భావంతో పని చేసిన ముదినేపల్లి మండలం చిగురుకోట గ్రామానికి చెందిన చలసాని జగన్మోహనరావుకు తొలిసారిగా నామినేటెడ్ పదవి లభించింది. జగన్మోహనరావు చిగురుకోట పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ పదవికి నామినేట్ అయ్యారు. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఎటువంటి పదవులు రాకపోయినా పార్టీ పట్ల అంకిత భావంతో పని చేస్తున్న అతి తక్కువ మంది నాయకుల్లో జగన్మోహనరావు ఒకరు.

వీఆర్వో మెడలో గొలుసు మాయం

ముదినేపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తన మెడలోని బంగారు చైన్ మాయమైందని బొమ్మినంపాడు వీఆర్‌వో పెనుమాల వెంకటేశ్వరరావు మంగళవారం ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం వెంకటేశ్వరరావు తన స్వగ్రామం వాడవల్లి వెళుతుండగా ఉప్పరగూడెం వంతెన వద్ద కొందరు ఆడవాళ్లు బైక్‌లపై వెళ్ళే వారిని ఆపి సొమ్ము వసూలు చేస్తున్నారని, ఆ సమయంలో తనను ఆపి తన వద్ద నుంచి రూ. 60 వసూలు చేశారన్నారు. తాను ఇంటికి వెళ్ళాక తన మెడలో 2 కాసుల బంగారు చైన్ లేకపోవడం గుర్తించానని, ఎంత వెదికినా కనిపించలేదని. తన గొలుసును ఆ ఆడవాళ్ళు దొంగిలించి ఉంటారన్న అనుమానంతో మంగళవారం వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివాము దగ్ధం

ముదినేపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెయ్యేరు శివారు రంగాపురంలో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించి వీరాస్వామి అనే రైతుకు చెందిన సుమారు 5 ఎకరాల వరిగడ్డివాము పూర్తిగా దగ్ధమై సుమారు రూ. 90 వేలు నష్టం వాటిల్లింది. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. కైకలూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు యత్నించినా వరిగడ్డి దక్కలేదు. తమ పశువులకు గ్రాసానికి కొనుగోలు చేసిన గడ్డివాము పూర్తిగా దగ్ధమవడంతో వీరాస్వామి ఆవేదన చెందుతున్నాడు.